జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | బుధవారం 19 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 195 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# అమరావతికి ప్రధాని మోదీ

- అమరావతి పున:ప్రారంభం.. ప్రధానికి ఆహ్వానం
- పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించనున్న సీఎం చంద్రబాబు
- రాజధాని పనుల పున:ప్రారంభంపై ప్రధాని నరేంద్ర మోదీ ముందు ఉంచాల్సిన ప్రతిపాదనలపై చర్చ
- ప్రధాని అనుకూల సమయం, అందుబాటులో ఉన్న ముహూర్త సమయాలు తదితర అంశాలపై సీఎం సమావేశం



**ప్రజాజ్యోతి అమరావతి**

అసెంబ్లీలోని ఛాంబర్‌లో మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమావేశమయ్యారు. రాజధాని పనుల పున:ప్రారంభంపై ప్రధాని నరేంద్ర మోదీ ముందు ఉంచాల్సిన ప్రతిపాదనలపై చర్చిస్తున్నారు. అలాగే ప్రధాని అనుకూల సమయం, అందుబాటులో ఉన్న ముహూర్త సమయాలు తదితర అంశాలపై సీఎం సమావేశమయ్యారు. ప్రధాని కార్యక్రమం కోసం స్థలం ఎంపిక ఇతర అంశాలపైనా సీఎం చర్చిస్తున్నారు. నవనగరాల్లో ఇంకా పనులు ప్రారంభించాల్సినవి ఏంటి, వాటిల్లో ప్రధానితో ఏవి శంకుస్థాపన చేయించాలి అనే అంశాలపై సీఎం నివేదిక తయారు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. నేడు, రేపటి ఢిల్లీ పర్యటనలో మోదీని కలిసి రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని - మిగతా3లో



తెలంగాణ పిటిషన్లపై కేంద్రం, ఏపీ సర్కారుకు

## ‘సుప్రీం’ నోటీసులు!

- కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణానదీ యాజమాన్య బోర్డుకి అప్పగించాలని కేంద్రం జారీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.
- కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం మరో పిటిషన్
- స్టే ఇవ్వాలంటూ తెలంగాణ వేసిన రిట్ పిటిషన్లపై రెండువారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు

## చంద్రబాబు చీప్ పాలిట్రిక్స్ మానుకో



- మా కార్పొరేటర్లను బెదిరించాలని చూస్తే సహించేది లేదు
- అధికారం శాశ్వతం కాదు. మళ్లీ మా ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది
- భవిష్యత్తులో అసలైన రాజకీయం వారికి చూపిస్తాం.
- పార్టీ మారమని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై ఒత్తిడి తెస్తున్నారు
- ప్రలోభాలతో ముగ్గురు నలుగురు కార్పొరేటర్లను చేర్చుకోవాలని చూస్తున్నారు.

**ప్రజాజ్యోతి విశాఖ**

సీఎం చంద్రబాబు చీఫ్ పాలిట్రిక్స్ మానుకోవాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ హితువు పలికారు. రాష్ట్రంలో విశాఖ మున్సిల్ కార్పొరేషన్‌పై కూటమి కుట్ర రాజకీయాలు తెరతీసింది.ఈ తరుణంలో కూటమి కుట్రా రాజకీయాలపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పందించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోసం సీటు - మిగతా3లో



## ఓటర్ ఐడీతో ఆధార్ లింక్

- సీఈసీ, కేంద్ర హోంశాఖ కార్యదర్శి కీలక భేటీ!
- ఇటీవల నకిలీ ఓటర్ కార్డ్ విషయంలో పార్లమెంట్‌తో పాటు బయట గందరగోళం నెలకొన్నది
- ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తాయి.
- దశాబ్దాల నాటి డూప్లికేట్ ఓటరు ఐడి నెంబర్స్ సమస్యను రాబోయే మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ

# మా లక్ష్యమిదే..

- వాట్సప్ గవర్నెన్సుపై లోకేశ్
- ప్రస్తుతం 200 పౌర సేవలు వాట్సప్ ద్వారా అందించగలుగుతున్నాం
- మన మిత్ర పేరిట ఈ వాట్సప్ గవర్నెన్సు సేవలు అందిస్తున్నాం
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వాయిస్ ద్వారా కూడా సేవలు అందించాలని భావిస్తున్నాం
- ఏఐ ఛాట్ బోట్ ద్వారానూ వాట్సప్ గవర్నెన్సు సేవలు అందేలా చర్యలు



**ప్రజాజ్యోతి అమరావతి**

వాట్సప్ గవర్నెన్స్‌పై ఏపీ శాసనసనసభలో లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పటేల్ పట్వారీ వ్యవస్థను రూపుమాపి ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్లారని.. చంద్రబాబు పౌరసేవలను ఈసేవగా మార్చి ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లారని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పూర్తిగా అర్థం చేసుకున్నామన్నారు. ప్రభుత్వం నుంచి సేవలు అందుకోవాలంటే చేతులు కట్టుకుని నిల్చున్న పరిస్థితి ప్రజలదన్నారు. అందుకే సులభతరంగా పౌరసేవలు అందాలని సంకల్పించుకున్నామని చెప్పారు. మంగళగిరిలో ఓ ఎంపీపీ కుల ధృవీకరణ పత్రం అడిగితే గత ప్రభుత్వ హయాంలో వేధించారని.. అప్పుడే ప్రజలకు అత్యంత సులువుగా - మిగతా3లో


## మోస్ట్ పొల్యూటెడ్ సిటీగా ఢిల్లీ

- జాబితాలో దక్షిణాది నగరాలు..!
- గతేడాది ఇదే సమయంలో 2023-24 శీతాకాలంలో పీఎం2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 189 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది
- ఢిల్లీలో గాలి నాణ్యత గతేడాదితో పోలిస్తే కాస్త మెరుగ్గా ఉన్నది
- ముంబయి, బెంగళూరు, కోల్‌కతాలో కాలుష్యం గత సంవత్సరంతో పోలిస్తే తగ్గింది
- సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక



## ప్రాజెక్టులో తొలి ఏడాది యాక్షన్ ప్లాన్

- విజయవాడకు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సభ్యులు..
- అమరావతి నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై చర్చ
- గత ఏడాది కాలంలో రాజధాని అమరావతిలో చేపట్టిన పనుల పురోగతిపై సీఆర్డీఏ అధికారులు వివరణ
- అమరావతి వాసులు అధికారులకు తమ సమస్యలు చెప్పుకునేందుకు, పరిష్కారం పొందేందుకు ఏర్పాట్లు



ప్రపంచ బ్యాంక్ ఆసియా అభివృద్ధి బ్యాంక్ సభ్యులు మంగళవారం విజయవాడకు తరలివచ్చారు. సీఆర్‌డీఏ అధికారులతో ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సభ్యులు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై చర్చ జరిగింది. ప్రాజెక్టులో భాగంగా తొలి ఏడాది యాక్షన్ ప్లాన్ గురించి చర్చ జరిగింది. సీఆర్‌డీఏ కార్యాలయం ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో ఏపీ సీఆర్‌డీఏ అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) అధికారులు కూడా పాల్గొన్నారు ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంలో రాజధాని అమరావతిలో చేపట్టిన పనుల పురోగతిపై సీఆర్డీఏ అధికారులు వివరణ ఇచ్చారు. అలాగే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేస్తున్న విధానం గురించి కూడా సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు వివరించారు. అమరావతి ప్రాంతంలో అమలు చేస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, నిర్మాణ కార్యకలాపాలు జరిగే చోట కార్మికుల భద్రతకు అమలు చేస్తున్న కార్యకలాపాల గురించి కూడా తెలియజేశారు. - మిగతా3లో

# మోస్ట్ పొల్యూటెడ్ సిటీగా ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీ నగరం మరోసారి మోస్ట్ పొల్యూటెడ్ సిటీగా నిలిచింది. 2024-25 శీతాకాలంలో (అక్టోబర్ నుంచి జనవరి 31 వరకు) ఢిల్లీలో సగటు పీఎం 2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 715 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది. ఇది ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే చాలా ఎక్కువగా. శుభవార్త ఏంటంటే.. ఢిల్లీలో గాలి నాణ్యత గతేడాదితో పోలిస్తే కాస్త మెరుగ్గా ఉన్నది. గతేడాది ఇదే సమయంలో 2023-24 శీతాకాలంలో పీఎం2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 189 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది. ఢిల్లీ తర్వాత పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నగరం దేశంలో రెండో అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. 2024-25 శీతాకాలంలో పీఎం 2.5 సగటు స్థాయి క్యూబిక్ మీటర్‌కు 65 మైక్రోగ్రాములుగా నమోదైంది. ఢిల్లీతో పోలిస్తే భారీగా తక్కువ ఉన్నది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ముంబయి, బెంగళూరు, కోల్‌కతాలో కాలుష్యం గత సంవత్సరంతో పోలిస్తే తగ్గిందని.. చెన్నై, హైదరాబాద్‌లో అలాగే ఉన్నట్లు నివేదిక పేర్కొంది. హైదరాబాద్‌లో పీఎం 2.5 సగటున క్యూబిక్ మీటర్‌కు 52 మైక్రోగ్రాములు, ముంబయిలో 50, బెంగళూరులో 37, చెన్నైలో 36 మైక్రోగ్రాములు ఉన్నట్లుగా నివేదిక తెలిపింది.

అయితే, ఢిల్లీలో కాలుష్యం తగ్గినప్పటికీ పరిస్థితి తీవ్రంగానే ఉందని డేటా పేర్కొంది. కాలుష్యం ఇప్పటికీ ఆరోగ్య ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. పీఎం 2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 15 మైక్రోగ్రాములకు మించకూడదు. ఢిల్లీలో కాలుష్య స్థాయి



పదకొండు రెట్లు ఎక్కువగా ఉన్నది. ఢిల్లీతో పాటు ఇతర మెట్రో నగరాల్లో కాలుష్యం తగ్గించడంపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. మొదట వాహనాల కాలుష్యాన్ని నియంత్రించాలని.. ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించాలని.. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచిస్తున్నారు. పర్యావరణ అనుకూల పరిశ్రమలను స్థాపించేలా చూడాలని చెబుతున్నారు. కర్మాగాల నుంచి వచ్చే పొగపై కఠినమైన నియంత్రణ అవసరమని.. చెత్తను కాల్చడంపై నిషేధం విధించాలని చెబుతున్నారు. వాస్తవానికి పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున చెత్తను కాల్చివేస్తున్న విషయం తెలిసిందే. మొక్కలను నాటడం.. నగరాల్లో పచ్చదనం పెంపుపై దృష్టి సారించడం అవసరమని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

# అంతా ఛావా వల్లే.. అసెంబ్లీలో సీఎం ఫడ్నవిస్ కీలక ప్రకటన

**ముంబై:** నాగపూర్‌లో గత రాత్రి నుంచి నెలకొన్న ఉద్రిక్తతలకు ఒక రకంగా 'ఛావా' సినిమానే కారణమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. మొఘలాయి చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలనే డిమాండ్‌తో మొదలైన ఆందోళన కాస్త హింసాత్మకంగా మారడం.. ఆపై నెలకొన్న కర్ఫ్యూ పరిస్థితులపై ఆయన ఇవాళ అసెంబ్లీలో కీలక విషయాలు వెల్లడించారు. ఇక్కడ నేను కేవలం ఒక సినిమాను మాత్రమే తప్పుపట్టాలని అనుకోవడం లేదు. కానీ, ఇలా మాట్లాడక తప్పడం లేదు. శంభాజీ మహరాజ్ చరిత్రను ఛావా చిత్రం ప్రజల ముందు ఉంచింది. అదే సమయంలో పలువురి మనోభావాలు రగిలిపోయాయి. అందుకే ఔరంగజేబు మీద వ్యతిరేకత అంశం ఒక్కసారిగా తెర మీదకు వచ్చింది. అయితే.. ఇదంతా పక్కా ప్రణాళిక బద్ధంగా జరిగిన కుట్ర అని అనుమానాలు వ్యక్తం చేశారు. ఔరంగజేబు సమాధి తొలగించాలనే డిమాండ్‌తో సోమవారం సాయంత్రం వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ధర్నా చేపట్టాయి. కర్రలతో ఔరంగజేబు నకిలీ సమాధి ఒకదానిని ఏర్పాటు చేసి తగలపెట్టారు. కాసేపటికే మతపరమైన ప్రతులు తగలబెట్టారని ప్రచారం రేగింది. ఇది కాస్త తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. కాబట్టి ఇందులో కుట్రకోణం కూడా దాగి ఉండొచ్చు అని అన్నారాయన. అయితే చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా సహించేది లేదని.. కులం, మతం ఏదైనా సరే ప్రజలు తమ భావోద్వేగాలను నియంత్రించుకోవాలని సూచించారాయన. అదే సమయంలో ఉద్రిక్తతలకు కారణమయ్యే వాళ్లపైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలంతా సమన్వయంతో పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు



సహకరించాలని అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే.. గత రాత్రి నాగ్‌పూర్ లో భారీ ఎత్తున విధ్వంస కాండ జరిగింది. రాళ్లు రువ్వుకుంటూ.. పలు వాహనాలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు.. పోలీసుపైకి రాళ్లు రువ్వారు. ఈ దాడుల్లో.. కేవలం పోలీసులకే 33 మందికి గాయాలైనట్లు సమాచారం. అయితే సాధారణ పౌరులు ఎంత మంది గాయపడ్డారనేదిపై అక్కడి మీడియా ఛానెల్స్ తలా ఓ ఫిగర్ చెబుతుండడం గమనార్హం. ఇదిలా ఉంటే.. దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన చిత్రంలో లీడ్ రోల్ శంభాజీగా విక్కీ కౌశల్ శంభాజీ భార్య యేసుబాయిగా రష్మిక, ఔరంగజేబుగా అక్షయ్ ఖన్నా తమ ఫెర్‌ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. అయితే సినిమా రిలీజ్ టైంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఈ చిత్రాన్ని ఆకాశానికి ఎత్తారు. మరాఠా యోధుడు శంభాజీ పోరాటాన్ని, త్యాగాన్ని ఇప్పటి తరానికి తెలియజేసిన ఈ చిత్రం నిజంగా ఓ అద్భుతమంటూ కొనియాడారు.

# 44 ఏళ్ల నాటి దళితుల ఊచకోత కేసు.. ముగ్గురు నిందితులకు ఉరిశిక్ష విధించిన ప్రత్యేక కోర్టు!

దాదాపు 44 ఏళ్లనాటి దళితుల ఊచకోత కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ప్రత్యేక కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. సామూహిక హత్యల కేసులో ముగ్గురు దోషులకు కోర్టు మరణశిక్ష విధించింది. ఇద్దరు దోషులకు ఒక్కొక్కరికి రూ. 2లక్షలు, మరో దోషికి రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. ఫిరోజాబాద్‌లోని జస్రానాలోని దిహులి గ్రామంలో 1981 నవంబర్ 24న జరిగిన 24 మంది దళితుల ఊచకోత కేసులో కోర్టు తీర్పును వెల్లడించింది. ఆ తర్వాత నిందితులను మైన్‌పురి జిల్లా జైటుకు తరలించారు.

**అప్పీల్‌కు అవకాశం..**

ఈ కేసులో నిందితులైన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంప్‌లను భారీ భద్రత మధ్య మెయిన్‌పురి జిల్లా నుంచి పోలీసులు ఉదయం 11.30 గంటలకు ఏడీజే స్పెషల్ రాబరీ ఇందిరా సింగ్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున రోహిత్ శుక్లా కోర్టు ఎదుట వాదనలు వినిపించారు. మారణహోమం కేసులో సాక్ష్యాలను పరిశీలించి.. నిందితులకు మరణశిక్ష విధించాలని కోర్టును కోరారు. కేసులో వాదనలు విన్న కోర్టు దోషులుగా తేలిన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌కు మరణశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. న్యాయమూర్తి తీర్పును ప్రకటించిన తర్వాత ముగ్గురు దోషులు కోర్టులోనే విలపించారు. వారి బంధువులు సైతం కంటతడిపెట్టారు. కోర్టు నిందితులకు 30 రోజుల్లోగా మరణశిక్షకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో 14 రోజుల పాటు దోషులు జైలులోని క్వారంటైన్ బ్యారక్‌లో ఉండనున్నారు. సమయానికి ఆహారం తీసుకుంటున్నారా? నిద్రపోతున్నారా? అని పరిశీలిస్తారు.

**అసలు ఏం జరిగిందంటే..!**

ఫిరోజాబాద్ జిల్లాలోని జస్రానా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని



దిహులి గ్రామంలో 24 మంది దళితులను ఊచకోత కోశారు. ఈ సంఘటన 1981 నవంబర్ 18న సాయంత్రం 6 గంటలకు జరిగింది. దోపిడీ దొంగలు సంతోష్, రాధే ముఠా ఆయుధాలతో దిహులి గ్రామంలోకి ప్రవేశించి.. ఓ కేసులో మహిళల, పిల్లలతో పాటు పలువురిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అంతే కాకుండా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో 24 మంది మరణించారు. ఈ ఘటనపై దిహులికి చెందిన లాయక్ సింగ్ 1981 నవంబర్ 19న జస్రానా పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేశారు. రాధేశ్యామ్ అలియాస్ రాధే, సంతోష్ సింగ్‌తో పాటు 20 మందిపై జస్రానా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు మెయిన్‌పురి నుంచి అలహాబాద్ కోర్టులో కొనసాగింది. 19 అక్టోబర్ 2024న కేసును మళ్లీ మెయిన్‌పురి సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు ప్రత్యేక రాబరీ కోర్టులో విచారణ జరిగింది. ఈ ఘటనలో 20 మందిపై కేసు నమోదవగా.. విచారణ సమయంలోనే 13 మంది మరణించారు.

**కేసు వివరాలు..**

మారణం హెూమానికి పాల్పడ్డారంటూ గ్యాంగ్ లీడర్ సంతోష్, రాధేశ్యామ్.. ముఠా సభ్యులు కమ్రుద్దీన్, శ్యామ్‌వీర్, కున్వర్‌పాల్, రాజే, భూరా, ప్రమోద్ రాణా, మలా?న్ సింగ్, రవీంద్ర సింగ్, దుర్గ్‌పాల్ సింగ్ కుమారుడు యుధిష్ఠిర్, మాన్ని సింగ్ కుమారుడు యుధిష్ఠిర్, మాన్ని సింగ్ కుమారుడు పంచమ్, లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, జ్ఞానచంద్ర అలియాస్ గిన్నా, కప్తాన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌పై కేసు నమోదైంది. లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, జ్ఞానచంద్ర అలియాస్ గిన్నా, కప్తాన్ సింగ్, రాంసేవక్, రాంపాల్ తప్ప అందరూ మరణించారు. కోర్టులో డెత్ రిపోర్ట్ సైతం దాఖలైంది. లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, గిన్నా ఇప్పటికీ పరారీలో ఉన్నారు. ఈ కేసులో పలువురిని సాక్ష్యులుగా చేర్చారు. ఇందులో కుమార్ ప్రసాద్ సాక్ష్యం కీలకంగా మారింది. ఆయన ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారు. మారణహెూమంపై ఆయన ఊచకోత, దోపిడీపై సాక్ష్యం అందించారు. ఈ ఘటన 1981 నవంబర్ 18న జరిగింది. దిహులిలో 24 మందిని అదే రోజు రాత్రి జస్రానా కోర్టులో కేసు నమోదైంది. 1982 ఫిబ్రవరి 26 వరకు ప్రధాన నిందితులు రాధే, సంతోష్ సహా 15 మంది నిందితుల అరెస్టు అయ్యారు. 1982 ఫిబ్రవరి 26న కోర్టులో చార్జిషీట్ దాఖలైంది. 1982 మే 13న కోర్టులో నిందితులపై అభియోగాలు మోపారు. 1982 మే 13న హైకోర్టు ఆదేశాల మేరకు కేసు ప్రయాగ్‌రాజ్ సెషన్ కోర్టుకు బదిలీ అయ్యింది. 19 అక్టోబర్ 2024న కేసును మళ్లీ మెయిన్‌పురి సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. తాజాగా ముగ్గురు దోషులకు కోర్టు

## ఆమె క్షేమంగా వస్తే చాలూ.. మాకు పండుగే!



**ఢిల్లీ:** తొమ్మిది నెలలపాటు అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుచ్ విల్మోర్‌లు ఎట్టకేలకు భూమికి తిరుగు పయనమయ్యారు. వ్యోమగాములంతా సురక్షితంగా భూమ్మీద అడుగు మోపాలని కోట్ల మంది ప్రార్థిస్తున్నారు. అయితే ఒక ఊరు మాత్రం ప్రత్యేకంగా సునీత క్షేమం కోసం పూజలు, హెూమాలు చేస్తోంది. ఆమె రాకను ఒక పండుగలా జరిపేందుకు సన్నాహాలు చేస్తోంది. సునీతా విలియమ్స్ భారత సంతతి అనే విషయం తెలిసిందే కదా. గుజరాత్‌లోని మెహసానా జిల్లా ఝూలాసన్ ఆమె పూర్వీకుల గ్రామం అక్కడ ఇప్పటికీ ఆమెకు బంధువులు ఉన్నారు. కిందటి ఏడాది.. సునీత అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయినప్పటి నుంచి వాళ్లంతా ఆందోళనతోనే ఉన్నారు. ఆమె క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు.. ఆమె తిరిగి వస్తుండడంపై వాళ్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "నా సోదరి సునీతా రాక కోసం మేమంతా ఎంతో ఎదురుచూస్తున్నాం. సునీత తల్లి, సోదరి, సోదరుడుతో సహా ఈ దేశంలోని కుటుంబంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. ఆమె సురక్షితంగా కిందకు దిగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. సునీత కోసం దేవాలయాలకు వెళ్లి పూజలు చేశాం. సునీతా కోసం యజ్ఞం నిర్వహిస్తున్నాం" అని ఆమె సోదరుడు దినేశ్ అంటున్నారు. మరోవైపు ఊరు ఊరంతా.. సునీత రాకను చిరస్మరణీయమైన రోజు.. దేశం గర్వించదగిన రోజుగా చెబుతోంది. దీపావళి పండుగలా ఆమె రాకను సంబురంగా జరిపేందుకు సిద్ధం అయ్యింది. సునీతా విలియమ్స్ గతంలో రెండుసార్లు భారత్ పర్యటనకు వచ్చారు. 2007లో తొలిసారి ఇండియాకు వచ్చిన ఆమె.. ఝూలాసన్‌తో పాటు సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. తిరిగి 2013లో పర్యటనకు వచ్చి.. కోల్‌కతా, న్యూఢిల్లీతో పాటు తన పూర్వీకుల గ్రామాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఝూలాసన్ గడ్డకు ఆమె ప్రత్యేకంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే.. కిందటి వ్యోమగాములను భూమ్మీదకు తీసుకొచ్చేందుకు అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ లోకి వీరు చేరుకున్నారు. ఈ వ్యోమనౌక అంతరిక్ష కేంద్రం నుంచి విడిపోయి భూమ్మీదకు బయల్దేరింది. స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ ఐఎస్‌ఎస్‌ను వీడే అన్‌డాకింగ్ దృశ్యాలను ప్రపంచమంతా వీక్షించేందుకు నాసా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది.

## వ్యోమగామి సునిత విలియమ్స్కు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ



**న్యూఢిల్లీ :** దాదాపు 9 నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత సంతతికి చెందిన వ్యోమగామి సునిత విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు వీరిరువురు తిరిగి భూమికి వస్తున్నారు. బుధవారం తెల్లావరుజామున వీళ్లు భూమ్మీదకు రానున్నారు. ఈ సందర్భంగా సునీత విలియమ్స్‌కు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. ఈ లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.సునీత విలియమ్స్ సురక్షితంగా భూమ్మీదకు రావాలని మొత్తం ప్రపంచం ఎదురుచూస్తోందని.. ఆమె కొన్ని వేల మైళ్ల దూరంలో ఉన్నా.. మన హృదయాలకు దగ్గరగా ఉంటారని మోదీ పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారని అన్నారు. తను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ని కలిసినా.. లేదా బైడన్‌ని కలిసినా.. ఆమె ఆరోగ్యం గురించి విచారించినట్లు పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఆమె సాధించిన ఘనతకు గర్వపడుతున్నారని తెలిపారు. ఆమె భర్త మైఖెల్ విలియమ్స్‌కి సునీతతో పాటు బుచ్ విల్‌మోర్‌కి కూడా ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు

## ఓటర్ ఐడీతో ఆధార్ లింక్



త్వరలోనే ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధించనున్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కేంద్ర హెూంశాఖ కార్యదర్శి మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలోనే ఓటర్ ఐడీ, ఆధార్ అనుసంధానంపై చర్చించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఈసీలు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో కేంద్ర హెూంశాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవో, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 నిబంధనల ప్రకారం.. ఓటర్ ఐడీకార్డును ఆధార్‌తో అనుసంధానంపై చర్చించారు.

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులు త్వరలో ఈ విషయంలో మరింత చర్చలు జరపాలని నిర్ణయించారు. ఇటీవల నకిలీ ఓటర్ కార్డ్ విషయంలో పార్లమెంట్‌తో పాటు బయట గందరగోళం నెలకొన్నది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సైతం ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవల ఎన్నికల సంఘం దశాబ్దాల నాటి డూప్లికేట్ ఓటరు ఐడీ నెంబర్స్ సమస్యను రాబోయే మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటర్ ఐడీతో ఆధార్ అనుసంధానంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

# మా లక్ష్యమిదే..

-మొదటిపేజీ తరువాయి

సర్టిఫికెట్లు జారీ చేసేలా వాట్సప్ గవర్నెన్సు తెచ్చామన్నారు. విజిబుల్ గవర్నెన్సు ఇన్విజిబుల్ గవర్నమెంట్ అనే అంశాన్ని బలంగా నమ్ముతున్నట్లు తెలిపారు. ఈ పౌరసేవల కోసం మళ్లీ ప్రత్యేకంగా మరో యాప్ కాకుండా అందరూ వినియోగించే వాట్సప్‌నే దీని కోసం వాడుకోవాలని భావించామన్నారు.

**ఈనెలాఖరుకు 300 సేవలు**

ప్రస్తుతం 200 పౌర సేవలు వాట్సప్ ద్వారా అందించగలుగుతున్నామని అన్నారు. మన మిత్ర పేరిట ఈ వాట్సప్ గవర్నెన్సు సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వాయిస్ ద్వారా కూడా సేవలు అందించాలని భావిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ సర్టిఫికెట్లు, ఆస్తి పన్నులను చెల్లించేలా వాట్సప్ గవర్నెన్సు సేవలు ఉంటాయన్నారు. ఈ నెలాఖరుకు 300 పౌరసేవలను అందించేలా లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రతీ ఆరు నెలలకు ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాలనే ఈ వాట్సప్ గవర్నెన్సు సేవలు అని స్పష్టం చేశారు. దీనికోసం కొన్ని చట్టాలను కూడా సవరించాలని భావిస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ సాయంతో ఈ ధృవీకరణ పత్రాలను జారీ చేయబోతున్నామని వెల్లడించారు.

**త్వరలోనే టీటీడీ సేవలు..**

ఏఐ ఛాట్ బోట్ ద్వారానూ వాట్సప్ గవర్నెన్సు సేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా భాషపై చర్చ జరుగుతోందని.. ఏపీలో చాలా భాషలు మాట్లాడే వ్యక్తులు ఉన్నారన్నారు. వారందరికీ వాట్సప్ గవర్నెన్సు సేవలు ఆయా భాషల్లోనే అందుతాయని తెలిపారు. ప్రస్తుతం 73 దేవాదాయశాఖకు చెందిన సేవలు వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందుతున్నాయన్నారు. త్వరలోనే టీటీడీ సేవలు కూడా వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొత్త కరెంటు కనెక్షన్ కావాలన్నా ఇప్పుడు వాట్సప్ ద్వారా అందుకోవచ్చన్నారు. 19 రెవెన్యూ సేవలు కూడా వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందుతున్నాయన్నారు.

**ఫోన్‌కే హాల్‌టికెట్స్..**

ప్రజలు తమ ఇబ్బందులకు సంబంధించిన ఫిర్యాదులు కూడా దీని ద్వారా నమోదు చేయొచ్చన్నారు. 51 లక్షల లావాదేవీలు వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఇప్పటి వరకూ జరిగాయని..



విద్యాశాఖ నుంచి హాల్ టికెట్ల జారీ కూడా వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందుతున్నాయన్నారు. పరీక్ష రాసే విద్యార్థుల హాల్ టికెట్లు నేరుగా వాళ్ల ఫోన్‌కే వచ్చేస్తున్నాయని.. ఇదో సక్సెస్ స్టోరీ అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల పరీక్షా ఫలితాలు కూడా వాట్సప్ ద్వారా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి పౌరులకు అందించిన లావాదేవీలు కోటీ యాభై లక్షల మేర జరిగితే అందులో వాట్సప్ గవర్నెన్సు సేవలే 51 లక్షల వరకూ ఉన్నాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం అంతా డేటా లేక్ ద్వారా సమన్వయపరిచి సేవలు అందిస్తున్నామని తెలిపారు.

**పూర్తి భద్రంగా డేటా..**

కేవలం పది సెకన్లలోనే పౌరులకు సేవలు అందించాలన్నది తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. అలాగే పౌరులకు సంబంధించిన సమాచారం కూడా పూర్తి భద్రంగా ఉంటుందన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. వ్యక్తిగత డేటాను ఎక్కడా ఎవరితోనూ పంచుకోవటం లేదన్నారు. పూర్తిగా ఎన్‌క్రిప్టెడ్ డేటా మాత్రమే నేరుగా వినియోగదారుకు వెళు తుందన్నారు. ఆధార్ ఎనేబుల్డ్ ఓటీపీ మాత్రమే జారీ అవుతుందన్నారు. ఐటీ చట్టం ప్రకారం వాట్సప్ గవర్నెన్సు ద్వారా జారీ అయ్యే పత్రాలకు పూర్తి చట్టబద్ధత ఉందన్నారు. సాంకేతికత విషయంలో పొరుగు రాష్ట్రాలు కూడా పోటీ పడుతున్నాయని తెలిపారు. వాట్సప్ గవర్నెన్సు సేవలను ఏపీ ప్రారంభించగానే అటు మహారాష్ట్ర కూడా నెల తర్వాత దీన్ని మొదలు పెట్టిందన్నారు. గ్రామవార్డు సచివాలయాలు తీసుకువచ్చాక గత ప్రభుత్వం మీసేవా కేంద్రాల నుంచి కొన్ని సేవలను తొలగించిందన్నారు. ఇప్పుడు వాట్సప్ గవర్నెన్సు వచ్చినంత మాత్రాన మీసేవా కేంద్రాల నుంచి సేవలను తొలగించబోమని స్పష్టం చేశారు. ప్రజలు కావాలనుకుంటే వాట్సప్ గవర్నెన్సు ద్వారా లేదంటే మీసేవా ద్వారా ప్రభుత్వ సేవలు పొందొచ్చన్నారు.

**సీఎం లక్ష్యమిదే..**

క్యూఆర్ కోడ్ ద్వారా ఒక్కసారి ధృవీకరణ పత్రం జారీ అయితే అది శాశ్వతంగా ఇచ్చినట్టే అని వెల్లడించారు. ప్రతీ ఆరు నెలలకూ ఓ సారి ధృవీకరణ పత్రం పొందాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యం సేకరణను కూడా దీంతో అనుసంధానం చేయాలని నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వం అంటే కార్యాలయం కాదని.. అందించే సేవలు గుర్తుకు రావాలన్నారు. ఏది అమలు చేసినా ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉండాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. ఆయన లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి వాట్సప్ గవర్నెన్సు మన మిత్ర సేవలను ప్రజలకు చేరువ చేస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# వైసీపీకి రానున్నదంతా గడ్డుకాలమే

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో వైసీపీకి రానున్న కాలమంతా గడ్డుకాలమే. ఎందుకంటే ఇప్పటికే అనేక విషయాలపై విచారణ ప్రారంభించిన ప్రస్తుత ప్రభుత్వం అన్ని విభాగాల్లో జరిగిన అవినీతిపై లోతైన దర్యాప్తు చేయనుంది. అయితే ఆధారాలను స్పష్టంగా సేకరించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయనున్నారు. న్యాయస్థానాల్లో వీగిపోకుండా పకడ్బందీగా అగ్రనేతల మెడ చుట్టూ కేసుల ఉచ్చు బిగుసుకునే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వంలో అనుసరించిన లిక్కర్ అమ్మకాలపైనే ఈ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. లిక్కర్ స్కామ్ లో నిందితులను వరసగా అరెస్ట్ లు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే ఒక ప్రణాళిక ప్రకారం పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించనున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ అమ్మకాలను ప్రభుత్వమే జరిపింది. నాసిరకం మద్యాన్ని అధిక ధరకు విక్రయించడం, డిజిటల్ పేమెంట్స్ కు అంగీకరించకపోవడం వంటి అంశాలు ఈ విచారణలో కీలకంగా మారనున్నాయి. ప్రయివేటు సిబ్బందిని లిక్కర్ దుకాణాల్లో నియమించి జరిపిన అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం ఎటు వెళ్లిందన్న దానిపై ఇప్పటికే ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా ఇటీవల మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరును



కూడా బయటపెట్టారు. ఆయనలే లిక్కర్ వ్యాపారంలో కీలకంగా వ్యవహరించారని సాయిరెడ్డి ఆరోపించారు. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కీలక పాత్ర పోషించారంటూ సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఇప్పుడు ఈ ఫైలు వేగంగా ముందుకు కదులుతుంది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి గత ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. అతనే ప్రధాన సూత్రధారి అంటూ సాయిరెడ్డి చేసిన కామెంట్స్ కోణంలో అధికారులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. తెర వెనక ఉండి ఆయనే అంతా నడిపించారని, లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎక్కడకు వెళ్లాయన్నది కసిరెడ్డిని విచారిస్తే ఖచ్చితంగా తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో వైసీపీ అగ్రనేతల ప్రమేయం ఉండే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వ పెద్దలు కొంత ఆలస్యమయినా పకడ్బందీగా కేసును రూపొందించాలని ఆదేశాలు జరీ చేసినట్లు సమాచారం. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి విదేశాల్లోనూ లిక్కర్ షాపులను నడిపిన అనుభవం ఉందని తెలియడంతో ఆయన గత ప్రభుత్వంలో ఈ స్కాంలో కీలకంగా వ్యవహరించారంటున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు అత్యంత దగ్గరని, ఆప్తుడని కూడా గుర్తించారు. ఈ కోణంలోనే దర్యాప్తు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. కసిరెడ్డి రాజవేఖర్ రెడ్డి దొరికితే మొత్తం వ్యవహారం బయటకు వస్తుందని విచారణ చేస్తున్న అధికారులు భావిస్తున్నారు. కసిరెడ్డి కోసం ఇప్పటికే వేట ప్రారంభమయిందని చెబుతున్నారు. ఆయన దొరికిన వెంటనే మద్యం కేసులో కీలక నేతలను కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేసే అవకాశముందని కూడా అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. డిస్టలరీలు, మద్యం అమ్మకాలు, నాసిరకం మద్యం వంటి అంశాలపై ఇప్పటికే కొంత మేరకు ఆధారాలను సేకరించిన అధికారులు స్పష్టమైన సాక్షాధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అవి లభించినట్లే ఊహించని పరిణామాలు ఏపీలో జరిగే అవకాశముందని చెబుతున్నారు.

# గిద్దలూరులో ఇన్నర్ ఫైట్

**ఒంగోలు :** గిద్దలూరులో ఇంత గొడవ జరుగుతున్నా వైసీపీ పెద్దల మౌనం? ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కేంద్రంగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కుండమార్పిడి రాజకీయాలు చేసింది వైసీపీ అధిష్టానం. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబును మార్కా పురం అభ్యర్థిగా ప్రకటించింది. అక్కడితో ఆగక మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డిని.. గిద్దలూరు కేండేట్ గా ప్రకటించింది. ఆయా అభ్యర్థులకు ఇష్టమున్నా లేకున్నా తాంబూలాలిచ్చేశాం తన్నుకు ఛావండంటూ వదిలేసింది. దీంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోయారు ఆయా వర్గాల వారు. చేసేది లేక.. ఆ ఎన్నికల్లో అలా పోటీ చేశారు కూడా.జగన్ అప్లై చేసిన ఈ కుండమార్పిడి ఫార్ములా.. ఇటు గిద్దలూరు, అటు మార్కాపురం రెండు సెగ్మెంట్లలో వర్కవుట్ కాలేదు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఘోర పరాజయం పాలైంది వైసీపీ. ఓటమి తర్వాత అన్నా రాంబాబు, నాగార్జున రెడ్డి.. తాము పోటీ చేసిన నియోజకవర్గాలకు పూర్తిగా దూరమయ్యారు. ఈ క్రమంలో ఎన్నికల ముగిసి.. 9 నెలలు దాటుతున్నా.. కార్యకర్తల మంచి చెడ్డ.. పట్టించుకునే నాథులే లేకుండా పోయారని సమాచారం. ఈ మధ్య గిద్దలూరు ఆత్మీయ సమావేశంలో కార్యకర్తలు ఇదే విషయంపై భగ్గుమన్నారు కూడా. అంతే కాదు ప్రస్తుత గిద్దలూరు ఇంచార్జిగా ఉన్న నాగార్జున రెడ్డి మాకు వద్దే వద్దంటూ.. నినాదాలు హోరెత్తించారటగిద్దలూరు వైసీపీ ఇంచార్జిగా తిరిగి మాజీ ఎమ్మెల్యే రాంబాబుకే ఇవ్వాలనీ డిమాండ్ చేశారట. లేకుంటే స్థానిక నేతలకు ఈ బాధ్యత అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాయట స్థానిక ఫ్యాను పార్టీ వర్గాలు. నియోజకవర్గంలో లేని, ఉండటానికే ఇష్టపడని.. నేతకు ఈ పోస్టు అప్పగించడంలో అర్థమే లేదని వాపోవడమూ కనిపిస్తోందట. జగన్ అసంబద్ధ నిర్ణయాలతో పార్టీ అడ్రెస్ గల్లంతయ్యే ప్రమాదమూ లేక పోలేదన్న హెచ్చరికలూ అందుతున్నాయట. ఈ దిశగా కొందరు ఓపెన్ గానే మాట్లాడుతున్నట్టు సమాచారం.ఇదిలా ఉంటే నాగార్జున రెడ్డి నిర్వహించిన ఒక సమావేశానికి కొందరు వైసీపీ లీడర్లు హాజరు కాలేదట. నాగార్జున రెడ్డి సైతం వీరిని కావాలనే ఆహ్వానించలేదట. గత ఎన్నికల్లో వైసీపీలోనే ఉంటూ.. టీడీపీ అభ్యర్థి అశోక్ రెడ్డికి వీరు సపోర్ట్ చేశారనీ. అందుకే వీరిని పిలవలేదన్న కామెంట్లు వినిపిస్తున్నాయట. ఎవరికైతే ఆహ్వానాలు అందలేదో.. వారు అధిష్టానానికి ఈ విషయమై ఫిర్యాదు కూడా చేశారట. నాగార్జున రెడ్డి ఒంటెత్తు పోకడల వల్లే వైసీపీ 600 ఓట్ల తేడాతో ఓడిపోవల్సి వచ్చిందని.. తమ కంప్లయింట్ లో వీరు ప్రముఖంగా ప్రస్తావించారట. అందుకే ఆయన్ను తిరిగి మార్కాపురానికి పంపించేయాలని వీరు రాసిన లేఖలు ప్రెజంట్ హాట్ టాపిగ్గా మారాయట.సలే అధికారం లేక ఆపసోపాలు పడుతుంటే.. ఈ గ్రూపు గొడవలేంటని వైసీపీ పెద్దలు తలలు బాదుకుంటున్నారట. ఇటు అన్నా రాంబాబుకు గిద్దలూరులో 15 ఏళ్ల అనుబంధముంది. ఇక గిద్దలూరు నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగానూ గెలిచారు. కాబట్టి.. స్థానిక వైసీపీలోని ఒక వర్గం.. మళ్లీ ఆయనే రావాలని కోరుకుంటున్నారట. తనకు రాజకీయ భవిష్యత్తునిచ్చిన గిద్దలూరులో.. రీ ఎంట్రీ ఇస్తే బాగుంటుందని.. రాంబాబు కూడా అనుకుంటున్నట్టు ఆయన అనుచర వర్గాల సమాచారం. రాంబాబు అయితేనే ఇటు ఆర్థికంగా అటు రాజకీయంగానూ బలమైన నేత గా నిలబడగలరనీ. తమకు అండగానూ ఉండగలరనీ.. వీరు భావించడం వల్లే.. అధిష్టానానికి ఈ దిశగా లేఖలు రాస్తున్నారట.గిద్దలూరు వైసీపీలోని మరో వర్గం మాత్రం.. స్థానిక రెడ్డి నేతలకే ఇంచార్జి బాధ్యతలు అప్పగించాలని కోరుతోందట.

## తెలంగాణ పిటిషన్లపై కేంద్రం, ఏపీ సర్కారుకు 'సుప్రీం' నోటీసులు..!

కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణానదీ యాజమాన్య బోర్డుకి అప్పగించాలని కేంద్రం జారీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. 2021లో కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటున్నారని ఏపీ పిటిషన్ వేసింది. తెలంగాణ జారీ చేసిన 34ని జీవోను రద్దు చేయాలని ఏపీ సుప్రీంకోర్టు తలుపుతట్టింది. తెలంగాణ, ఏపీ వేసిన పిటిషన్లను ఒకేసారి కేంద్ర ప్రభుత్వం మంగళవారం విచారించింది. కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం మరో పిటిషన్ వేసింది. స్టే ఇవ్వాలంటూ తెలంగాణ వేసిన రిట్ పిటిషన్లపై రెండువారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేసిన వారంలోగా రిజాయిండర్ ఫైల్ చేయాలని కోర్టు ఆదేశించింది.

## ప్రాజెక్టులో తొలి ఏడాది యాక్షన్ ప్లాన్

-మొదటిపేజీ తరువాయి

అలాగే ఈ సమావేశంలో నిధుల మంజూరు కోసం ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ నిర్దేశించిన నిబంధనల అమలుపై కూడా చర్చ జరిగింది.
రాజధాని అమరావతి నిర్మాణంలోనూ, ప్రొక్యూర్మెంట్, టెండరింగ్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేస్తున్నట్టు బ్యాంకుల సభ్యులకు సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు వివరించారు. అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక వ్యవస్థ రూపొందించినట్టు తెలిపారు. అమరావతి వాసులు అధికారులకు తమ సమస్యలు చెప్పుకునేందుకు, పరిష్కారం పొందేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, సీఆర్‌డీఏ అధికారుల ప్రజెంటేషన్ పట్ల ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## అమరావతికి ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు ఆహ్వానించనున్నారు. కాగా.. ఇప్పటికే రూ.22 కోట్లకు పైగా అమరావతిలో పనులు చేసేందుకు నిన్న (సోమవారం) కేబినెట్ కూడా ఆమోద ముద్ర వేసింది. అదే విధంగా ప్రధాని చేతుల మీదుగానే అమరావతి పనులు పున:ప్రారంభిస్తామని ఇప్పటికే ఓ కార్యక్రమంలో సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ముహూర్త సమయాన్ని సిద్ధం చేసుకుని ఢిల్లీ వెళ్లాలని సీఎం నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే ఏ సమయం బాగుంటుందనే దానిపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఢిల్లీ షెడ్యూల్ ఇదే...**

మరోవైపు ముఖ్యమంత్రి ఢిల్లీ షెడ్యూల్ కూడా ఖరారైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లనున్నారు సీఎం. ఈరోజు రాత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుటుంబంలో జరిగే వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. రేపు (మార్చి 19) మధ్యాహ్నం గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్‌తో ముఖ్యమంత్రి సమావేశంకానున్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం అందించనుంది. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ ఒప్పందాలు చేసుకోనున్నాయి. 19న సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ నుంచి బయలుదేరి అమరావతికి తిరిగి వస్తారు. 20న అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబు పాల్గొంటారు. 20వ తేదీ రాత్రికి అమరావతి నుంచి తిరుమలకు వెళ్లనున్న సీఎం.. 21న తిరుమలలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం చేసుకుని అనంతరం తిరుగు ప్రయాణం అవుతారు.

## 'చంద్రబాబు చీప్ పాలిట్రిక్స్ మానుకో'

-మొదటిపేజీ తరువాయి

త్యాగం చేసిన మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ పరిస్థితి ఏంటో అందరికీ తెలుసు.. మరి వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన కార్పొరేటర్లు, నాయకుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలుసుకోండి. పార్టీ మారమని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రలోభాలతో ముగ్గురు నలుగురు కార్పొరేటర్లను చేర్చుకోవాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రలోభాలను పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలి. చంద్రబాబు చీఫ్ పాలిట్రిక్స్ చేయడం మానుకోవాలి. వైఎస్ జగన్‌పై కార్పొరేటర్లకు విడదీయరాని అనుబంధం ఉంది. కార్పొరేటర్లకు సముచిత స్థానం పార్టీలో ఉంటుంది. మా కార్పొరేటర్లను బెదిరించాలని చూస్తే సహించేది లేదు. అధికారం శాశ్వతం కాదు. మళ్లీ మా ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. భవిష్యత్తులో అసలైన రాజకీయం వారికి చూపిస్తాం. పవన్ కళ్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన వర్మ పరిస్థితి ఏంటో అందరికీ తెలుసు. మరి వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన కార్పొరేటర్లు, నాయకుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలుసుకోండి'అని సూచించారు.

# పవన్ డిఫెన్స్‌లో పడిపోయారా

**విజయవాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం తాను అనుకున్నది సాధించలేకపోతున్నారు. లక్ష్యం కూడా ఎంత దూరంలో ఉందో తెలియదు. ముఖ్యమంత్రి గా పవన్ కల్యాణ్ ను చూడాలని కాపు సామాజికవర్గం, పవన్ అభిమానులు బలంగా కోరుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ లో అటువంటి ఆలోచన లేకపోవడంపై వారిలోనే చర్చ జరుగుతుంది. తాము అనుకున్నది వేరని, ప్రతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు కాపు సామాజికవర్గానికి చెందిన వారుంటారని, ఇక పవన్ కల్యాణ్ కు మద్దతిచ్చినందుకు ప్రత్యేకంగా సాధించింది ఏముందన్న ప్రశ్న ఆ సామాజికవర్గం నుంచి ఈ మధ్య కాలంలో బలంగా వినిపిస్తుంది. వైసీపీ విమర్శలు చేస్తూ కాలం గడిపేసే రోజులు పోయాయి. ఎందుకంటే జగన్ ఇప్పుడు అధికారంలో లేరు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల అమలుపై కూడా పవన్ కల్యాణ్ ప్రశ్నించకపోవడంతో పాటు టీడీపీకి బలమైన మద్దతుదారుగా మారడాన్ని కూడా జనసేన కార్యకర్తల నుంచి సామాజికవర్గం నేతలు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. తాము ఊహించింది ఒకటి.. జరుగుతున్నదొకటిలా తయారయిందన్న నిరాశ నిస్పృహలు వారిలో కనిపిస్తున్నాయి. అయితే తాము ఏ మాత్రం దాచుకోకుండా తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా కుండబద్దలు కొట్టేస్తున్నారు. పదేళ్ల పాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగానే కొనసాగుతారని చేసిన పవన్ కల్యాణ్ వ్యాఖ్యల దగ్గర నుంచి ఇటువంటి పరిస్థితి తలెత్తింది.ఇక కాపు, బలిజ సంక్షేమ సేన నేత హరిరామ జోగయ్య కూడా పవన్ కల్యాణ్ ను నేరుగా తప్పుపడుతూ బహిరంగ లేఖను రాస్తున్నారు. ఇది కొంత పవన్ తో పాటు జనసేనకు కూడా ఇబ్బందికరంగా మారింది. రాజధాని నిర్మాణం కోసం వేల కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్న ప్రభుత్వం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అభివృద్ధిపై పవన్ కల్యాణ్ పెదవి విప్పకపోవడంపై జనసేన అధినేత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. రాజధాని నిర్మాణం అనేది దశల వారీగా జరగాలని, అంతే తప్ప నిధులన్నీ అక్కడ వెచ్చించి మిగిలిన ప్రాంతాలకు, సంక్షేమ పథకాలను అందించకుండా ప్రజలను మోసం చేయడం కాదా? అని కాపు నేతలే ప్రశ్నిస్తున్నారు.వరసగా అగ్రనేతలు తప్పని కష్టాలు ఇరకాటంలో పెట్టేదే... ఇది కొంత పవన్ కల్యాణ్ ను ఇరకాటంలో పెట్టేదే. ఎందుకంటే పవన్ కల్యాణ్ పై ఎన్నికలకు ముందు వరకూ ఎన్నో హోప్స్ ఉన్నాయి. 2014 నుంచి ఆయన ప్రసంగాలు, ఆవేశపూరిత పంచ్ లు విని ఊగిపోయిన వారు నేడు జరుగుతున్న తీరు చూసి ఉసూరుమంటున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలోనే అర్థమవుతుంది. ఎఫెన్స్ లో ఉంటేనే పవన్ కల్యాణ్ ఇమేజ్ పెరుగుతుంది తప్పించి, డిఫెన్స్ లో ఉంటే ఖచ్చితంగా డ్యామేజీ అవ్వకతప్పదని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మొత్తం మీద పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత వేరే లెవెల్లో ఉంటుందని అంచనా వేసిన వారికి నేడు ఆయన నుంచి వస్తున్న స్పందన చూసి డల్ అయినట్లే కనిపిస్తుంది.

## సంపాదకీయం

# దివ్యాంగులకు చేయూత మానవ ధర్మం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 3వ ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా ఉండేది. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవంను జరుపుకునేవారు. గతంలో యుద్ధాలలో వికలాంగులైన సైనికులు మాత్రమే ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారము నాడు వికలాంగుల దినోత్సవము జరుపుకునేవారు. దానిని ఐక్యరాజ్య సమితిలో ఆమోదించి అన్ని రకాలుగా వికలాంగులైన వారందరు ప్రపంచ యావత్తు ఈ వేడుకలను నిర్వహించు కోవాలని ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారాన్ని "ప్రపంచ వికలాంగుల దినోత్సవము"గా ప్రకటించ బడినది. అలాగే 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరముగా ఐక్యరాజ్య సమితి ప్రకటించటం, ఆ సంవత్సరములో ఎన్నో కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. అలాగే, 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి వికలాంగుల దశాబ్దంగా ప్రకటించింది. ఎన్నో వర్గాల వారికి అనగా కార్మికులకు మేడే – మే 1వ తేదీన, పిల్లలకు చిల్లన్ స్డే నవంబర్ 14వ తేదీన, మహిళలకు ఉమెన్స్ డే మార్చి 8వ తేదీన చివరకు ప్రేమికులకు వాలెంటైన్స్ డే ఫిబ్రవరి 14వ తేదీన ఇలా ప్రతిదానికి ఒక నిర్దిష్టమైన తేది ఉంటే వికలాంగులకు మాత్రం నిర్దిష్టమైన తేదీ లేకుండేది. మార్చి 3వ ఆదివారం "ప్రపంచ వికలాంగుల దినోత్సవము" జరుపడం వలన ప్రతి సంవత్సరము ఏదో ఒక తేదీన రావడం వలన ఫలాన తేది నాడు వికలాంగుల దినోత్సవము అని గుర్తించ లేకపోవడం జరిగినది. ఈ విషయమై 1994వ సంవత్సరము మొదటిలోనే ఐక్యరాజ్య సమితిలో మరొక పర్యాయం చర్చించి మార్చి 3వ ఆదివారం నాడు జరుపుతున్న "ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని" 1994 నుండి డిసెంబర్ 3వ తేదీనాడు "అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవముగా" జరపాలని ప్రకటించ బడినది. ఆ నాటి నుండి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ప్రతి సంవత్సరము డిసెంబర్ 3వ తేదీనాడు యావత్తు ప్రపంచములో నిర్వహించ బడుచున్నవి. 1995 వికలాంగుల హక్కుల చట్టం వచ్చినప్పటి నుండి వికలాంగుల సంక్షేమము మరియు అభివృద్ధి కై పలు పథకాలు ప్రవేశ పెట్టబడినవి. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1981లో ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సహకార సంస్థ ఏర్పాటు చేయడం, తరువాత 1983లో వికలాంగుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. వాస్తవానికి ఆంగ్ల భాషలో హ్యాండి క్యాప్ డ్, డిజేబుల్డ్, ఫిసికల్లీ ఛాలెంజ్డ్ అని రక రకాల పదాలు వాడుతున్నా, తెలుగులో అంగవికలులను "వికలాంగులు" కాకుండా "దివ్యాంగులు"గా పేర్కొనడం సమంజసంగా భావించి, సాధ్యమైనంత వరకూ వికలాంగులు అనే పదం వాడుక భాషలో తీసేసి, అలాగే దివ్యాంగులు పదమే వాడుతున్నారు. సమాజంలోని దివ్యాంగుల పట్ల స్వాభావిక గౌరవం, వ్యక్తిగత స్వయం ప్రతిపత్తి, వివక్షత లేని సమాజం, అవకాశాల సమానత్వం, అవరోధ రహిత వాతావరణం నిర్మాణం కొరకు, దివ్యాంగుల హక్కులకు కలుగ జేయడానికి కేంద్ర ప్రభుత్వం 2016లో దివ్యాంగుల హక్కుల చట్టాన్ని రూపొందించింది.దీన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడానికి గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల నియమాలు 2018లో రూపొందించారు. ఈ చట్టంలో భాగంగా దివ్యాంగులకు అన్ని రంగాలలో సమానత్వం కల్పించడానికి ప్రత్యేక హక్కులతో పాటు 5% రిజర్వేషన్ కల్పించారు. వారి స్వాలంబనకై తెలంగాణ రాష్ట్రం లో తెలంగాణ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు ఏడు లక్షల 30 వేల దివ్యాంగులకు ప్రతి నెల మూడు వేల పదహారు రూపాయలు పెన్షన్లు ఇవ్వడం జరుగుతున్నది. అలాగే వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో వెళ్లడానికి అవరోధ రహిత వాతావరణం కల్పించుటకు, అన్ని సంస్థల్లో ర్యాంపులు నిర్మాణమే గాక అచట దివ్యాంగులు ఉపయోగించుకునే మూత్రశాలలు, వీల్ చైర్ లు ఏర్పాటు చేయడానికి ఈ చట్టం వీలు కల్పించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించడానికి స్వయం ఉపాధి పథకం కింద 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతున్నది ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికను జోడించి అనేక అభివృద్ధి చెందిన ఉపకరణాలను కూడా అందజేయడం జరుగుతున్నది.

# కాకలుతీరిన కమ్యూనిస్టు యోధుడు



నంబూద్రిపాద్ భారతీయ కమ్యూ నిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రాజకీయవేత్త, సిద్ధాంతకర్త. దేశ చరిత్ర లో గుర్తింపు పొందిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు. భారత దేశంలో కాంగ్రెసేతర సంబంధిత కమ్యునిస్టు పార్టీ పక్షాన ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా వినుతి కెక్కారు. మార్క్స్ వాద సూత్ర బద్ధు డు, విప్లవవాది, రచయిత, చరిత్ర కారుడు. మార్క్స్ వాద కమ్యూని స్టు పార్టీ ఆచరణ వాదిగా, క్రియా శీలక నేతగా, 14 యేళ్ళ పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తీసుకున్న చొరవ, ముందు చూపు గల నిర్ణయాలవలనే దేశంలో ఈనాడు జాతీయ స్థాయి సంకీర్ణ ప్రభుత్వ రాజకీయాలకు భూమిక అయిందన్న మాట వాస్తవం. నంబూద్రిపాద్ కేరళలో శ్రీకారం చుట్టిన మౌలికమైన భూ సంస్కరణలు, విద్యా సంస్కరణ లను అనుకరించే ప్రయత్నాలు ఈ నాటికి ఇతర భారతీయ రాష్ట్రా లలో జరుగుతూనే ఉన్నాయి. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా, భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ బహు ముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు రుషి, నిరంతర క్రియాశీలి. అవిశ్రాంత కలం యోధులు. సాహితీ విమర్శ కులు. సాంస్కృతిక సైనికుడు. పాలనా చతురులు. సిద్ధాంత, ఆచరణల సంగమం. విప్లవ మేధావి. భావితరాలకు చెరగని ఆదర్శం. ఒకనాటి భారత రాష్ట్ర పతి కెఆర్ నారాయణన్ అభివర్ణించి నట్లుగా 20వ శతాబ్దపు మహెూన్నత వ్యక్తి. ఇ.ఎం.ఎస్. అనే పేరుతో ప్రసిద్ధి కెక్కిన ఏలాంకుళం మనక్కళ్ శంకరన్ నంబూద్రిపాద్, (1909 జూన్ 13 %–% 1998 మార్చి 19) 1909 జూన్ 13 నాడు, ప్రస్తుత మలప్పురం జిల్లా పెరింతాళ్ మన్న తాలూకా ఏలాంకుళం గ్రామంలోని అగ్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తండ్రి పేరు పరమేశ్వరన్ నంబూద్రిపాద్. విద్యార్థి దశనుంచే శాస్త్రీయ భావాలు అలవరుచు కున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు.చిన్న వయసులోనే ఆయన వి.టి.భట్టాద్రిపాద్ మొదలయిన పెద్దవారికి చేయూతగా, కేరళ నంబూద్రి కుటుంబాలలో పాతుకు పోయిన కులవివక్ష, సాంప్రదాయ వాదం ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. చదువుకునే రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ సహ చర్యంతో స్వాతం త్ర్య సంగ్రామంలో తీవ్ర కృషి చేసారు. 1931 లో కాలేజీని వదిలి స్వాతం త్ర్య పోరాటంలో చేరారు. సత్యా గ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అప్పటినుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారు. కేరళలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరుగా వున్నారు. 1934 లో ఆయన కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు పార్టీ అఖిల భారత ఉమ్మడి కాలంలో కాంగ్రెస్ పార్టీకి, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మార్క్సిజంతో పరిచయం చేశారు. 1936 లో కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల్లో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్య మం అభివృద్ధికి పునాదులు వేశా రు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. రెండు పోరాటాలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. కేరళను ఏకీకృత భాషా రాష్ట్రంగా ఏర్పర్చడానికి దారితీసిన ఐక్య కేరళ ముఖ్య ప్రతిపాదకులలో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ మొట్టమొదట 1939 లో మద్రాసు ప్రొవిన్షియల్ శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యునిస్ట్ పార్టీని విస్తృత పరచడానికి ఆయన తన వాటగా వచ్చిన ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చాడు. అతను 1939–42 మరియు 1948–50 మధ్య అజ్ఞాతం లోకి వెళ్ళారు. ఆయన 1941 లో భారత కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. డిసెంబరు, 1950 లో సిపిఐ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశారు. 1957 లో కేరళ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి ఎన్నిక లలో కమ్యూనిస్ట్ పార్టీ మెజారిటీ సాధించడంతో 1957 ఏప్రిల్ 5 నాడు కేరళ రాష్ట్ర ప్రథమ ముఖ్య మంత్రిగా పగ్గాలు చేపట్టి భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. త్వరలోనే భూ సంస్కరణల చట్టాన్ని,విద్యా చట్టాన్ని తీసుకు వచ్చారు. వివాదాస్పదమైన పరిస్థి తుల్లో 1959 లో కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం లోని 356 వ ప్రకరణం అనుసరించి రాష్ట్రపతి పాలన విధిస్తూ ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. కేరళ శాసన సభకు 1960–64, తిరిగి 1970–77 కాలం లో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహ రించారు.1967 లో రెండవసారి ముఖ్యమంత్రి కావడానికి నంబూ ద్రిపాద్ ముస్లిమ్ లీగ్ తో సహా 7 పార్టీల మద్దతు స్వీకరించారు.1964 లో సిపిఐ (ఎం) ను స్థాపించిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అందులో చేరారు. 1964 లో జరిగిన అఖిల భారత మహాసభలో పార్టీలో కేంద్ర కమిటీ మరియు పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆయన మరణం వరకు ఈ పదవిలో కొనసాగారు. 1977 లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పదవిని చేబట్టి 1992 వరకు ఆ బాధ్యతలను నిర్వహిం చారు. అన్ని వామపక్ష, ప్రజాస్వా మ్య, లౌకిక శక్తులను సమీకరిం చడంలో ఆయన నాయకత్వం అమూల్యమైనది. ఒక తెలివైన మార్క్సిస్ట్ సిద్ధాంత కర్తగా, భారతీయ సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం అన్వయించడంతో పాటు భారతీ య విప్లవం యొక్క వ్యూహానికి అనుగుణంగా సాగించాల్సిన, సాగించిన కృషిని ఆయన రచించారు. ఆయన వ్రాసిన పలు గ్రంథాలలో కేరళ చరిత్ర అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది.భూమి సంబంధాలు, కేరళ, సమా జం, రాజకీయాలు, మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాహిత్యం మరియు చరిత్రలపై ఆయన వ్రాసిన రచనల తో ఆయన్ను దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రభావ వంతమైన కమ్యూనిస్టు ఆలోచనా పరులలో ఒకరిగా గుర్తించ బడ్డాయి. విశిష్ట మార్క్సిస్ట్ సూత్రవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆయన ముందు చూపుకు నిజాయితీ నిబద్ధతలకు కేరళ సాధించిన అభివృద్ధే తార్కాణం. ప్రజల యోజన ద్వారా కేరళలో అధికార, వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యతా ఉద్యమానికి కృషి చేసారు. ఆంగ్ల, మలయాళ భాషల్లో అనేక పుస్తకాలు రచించిన నంబూద్రిపాద్ పత్రికా విలేఖరిగా కూడా సుపరి చితుడే. ఈ నాటికీ కేరళలో ఆయన పేరు, ఒకప్పటి ఈయన ప్రభుత్వ పనితీరుల గుఱించి దినదినం గొప్పగా చెప్పుకుంటూనే ఉంటారు. నంబూద్రిపాద్ 1998 మార్చి 19 న మరణించారు.

# ఆశలు రేకెత్తిస్తున్న అంతరిక్ష అంతర్జాలం



మన దేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అందించడానికి జియో, ఎయిర్ టెల్ టెలికాం సంస్థలు ఎలాన్ మస్క్ కంపెనీకి చెందిన స్పేస్ఎక్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రస్తుత డిజిటల్ యుగంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరం ఉంది. మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన ఇంటర్నెట్ అందించాలంటే ప్రస్తుత సాంప్రదాయ ప్రోటోకాల్‌తో సాధ్యం కాదు. దీనికి పరిష్కారంగా ఉపగ్రహ ఆధారిత ఇంటర్‌నెట్ మాత్రమే! ఎందుకంటే దీనికి టవర్స్, కేబుల్స్ అవసరం ఉండదు. మనం ఇప్పుడు ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్‌లో కొంచెం మోడిఫికేషన్ చేసి ఈ శాటిలైట్ ఇంటర్నెట్ పొందవచ్చు. ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేని మారుమూలలో ఉన్న గిరిజన ప్రాంతాలకు ఇంటర్‌నెట్ అందుబాటులోకి వస్తుంది. అలాగే నిత్యం ప్రయాణాలు చేసేవారికి వ్యాపార సంబంధిత సమాచారాన్ని పొందడానికి, గ్రామీణ ప్రజలు అన్నిరకాల ప్రభుత్వ సేవలు పొందడానికి, అధిక వేగవంతమైన ఇంటర్నెట్ అవసరమయ్యే వ్యక్తులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, నిర్మాణ పనులు, సాంకేతిక సమస్యల కారణంగా అంతరాయాలకు గురయ్యే భూసంబంధమైన భౌతిక అడ్డంకులకు ప్రభావితం కాదు. సవాళ్లతో కూడిన వాతావరణాలలో, అత్యవసర సమయాల్లో కూడా నిరంతరాయంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని ఆస్వాదించవచ్చు. ఆర్థిక అభివృద్ధి, విద్య, కమ్యూనికేషన్‌ను ప్రోత్సహించడంలో సాయపడుతుంది. స్థిరమైన కనెక్టివిటీ అవసరమైన సముద్ర, విమానయాన పరిశ్రమలలో కూడా ఉపగ్రహ ఇంటర్నెట్ ఉపయోగపడుతుంది. భూమి చుట్టూ తిరుగుతున్న ఉపగ్రహాలపై ఆధారపడే ఒక రకమైన ఇంటర్నెట్ కనెక్షన్. సర్వీస్ ప్రొవైడర్లు ఇంటర్నెట్ సిగ్నల్స్ ఉపగ్రహానికి పంపిస్తారు. అవి డిష్ ద్వారా వినియోగదారులకు చేరుతాయి. అయితే ఇది మనం అనుకున్నంత సులభం కాదు. వీటికి ఎంతో సాంకేతికతతోకూడిన ఉపగ్రహాలు అవసరం. భూమధ్యరేఖకు 22,300 మైళ్ల ఎత్తులో ఉన్న జియోస్టేషనరీ ఉపగ్రహంతో తగు పరికరాల సహాయంతో భూమిపై నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్ (నాక్) అని పిలువబడే ప్రదేశంనుండి డేటాను ప్రసారం చేసి స్వీకరించవలసి ఉంటుంది. ఉపగ్రహ ఇంటర్నెట్ సేవ సాధారణంగా వ్యక్తిగత వినియోగదారులకు భూస్థిర ఉపగ్రహాల ద్వారా అందించబడుతుంది.ఇవి సాపేక్షంగా అధిక డేటా వేగాన్ని అందిస్తాయి. కొత్త ఉపగ్రహాలు సెకనకు 506 మెగాబిట్స్ వరకు డౌన్‌స్ట్రీమ్ డేటా వేగాన్ని సాధించడానికి 'క్యు' (కెయు) బ్యాండ్‌ని ఉపయోగిస్తాయి. అంతరిక్షంలో ఒక నిర్దిష్ట బిందువు వద్ద ఉపగ్రహాన్ని భూమి నుండి కదలకుండా కనిపించే కక్ష్యలో ఉంచడం వలన ఉపగ్రహం భూమిచుట్టూ ఒక కక్ష్యను ఖచ్చితంగా 24 గంటల్లో పూర్తి భ్రమణం చేస్తుంది. ఉపగ్రహం ద్వారా పంపబడిన సమాచారం కాంతి వేగంతో అంటే సుమారు సెకనుకు 1,86,000 మైళ్ళుతో నాలుగు సార్లు ప్రయాణించాలి. అంటే కంప్యూటర్ నుండి ఉపగ్రహానికి, ఉపగ్రహం నుండి నాక్ లేదా ఇంటర్నెట్‌కు, అక్కడ నుండి ఉపగ్రహానికి, చివరకు ఉపగ్రహం నుండి కంప్యూటర్‌కు తిరిగి వెళ్ళాలి. ఈ మొత్తం ప్రయాణాన్ని పూర్తి చేయడానికి పట్టే సమయాన్ని జాప్యం అంటారు. ఇది దాదాపు అర సెకను. ఉపగ్రహ ఇంటర్నెట్ వేగం సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ లేదా ఫైబర్ ఆప్టిక్ కనెక్షన్‌ల వలే వేగంగా ఉండకపోవచ్చుగానీ భూమి మీద చాలా ప్రాంతాన్ని కవర్ చేస్తుంది. ఉపగ్రహ ఇంటర్నెట్ ప్రధాన లోపాలలో ఒకటి జాప్యం. ఇది వినియోగదారు పరికరం అంతరిక్షంలో ఉపగ్రహం మధ్య డేటా సిగ్నల్‌లను ప్రసారం చేయడంలో ఆలస్యాన్ని సూచిస్తుంది. సంకేతాలు భూమి, ఉపగ్రహాల మధ్య చాలా దూరం ప్రయాణించాలి. ముఖ్యంగా జియోస్టేషనరీ ఎర్త్ ఆర్బిట్ (జియో) ఉపగ్రహాలతో గుర్తించదగిన జాప్యాలు ఏర్పడతాయి. బ్యాండ్‌విడ్త్ పరిమితులు ఇంటర్నెట్ కనెక్షన్ సామర్థ్యం, వేగాన్ని ప్రభావితం చేస్తాయి. వర్షం, మంచు, ఇతర వాతావరణ పరిస్థితులు సిగ్నల్ ప్రసారానికి అంతరాయం కలిగించవచ్చు. దీని వలన సిగ్నల్ నష్టం లేదా డేటా రేట్లు తగ్గుతాయి. ఉపగ్రహాలకు స్పష్టమైన లైన్– ఆఫ్– సైట్ ఉన్న ప్రాంతాలలో ఉపగ్రహ ఇంటర్నెట్ అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. ఇది జనసాంద్రత కలిగిన పట్టణ ప్రాంతాలలో లేదా అడ్డంకిగా ఉండే భూభాగాలు ఉన్న ప్రాంతాలలో సవాలుగా ఉంటుంది. ఈ పద్ధతిలో ఇంటర్నెట్ కోసం వేలాది ఉపగ్రహాలను ప్రయోగించడం వల్ల అంతరిక్ష శిథిలాలు ఢీకొనే అవకాశం గురించి ఆందోళనలు తలెత్తుతున్నాయి. ఉపగ్రహాలు జామింగ్, హ్యాకింగ్, ఇతర సైబర్ దాడులకు గురవుతాయి. ఇవి ఇంటర్నెట్ కమ్యూనికేషన్‌కు అంతరాయం కలిగిస్తాయి. ఉపగ్రహాల విస్తరణల సంఖ్య పెరగడం వలన పరిమిత రేడియో ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రం కోసం పోటీ తీవ్రమవుతుంది. ఉపగ్రహ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి అమలు చేయడానికి అయ్యే అధిక వ్యయం లాంటివి పరోక్షంగా వినియోగదారు అనుభవాన్ని ప్రభావితం చేస్తాయి.కార్యాచరణ అడ్డంకులను కలిగిస్తాయి. వీటిని అధిగమించడానికి ఉపగ్రహ ఇంటర్నెట్ యాక్సెస్‌ను మెరుగుపరచడానికి డిజిటల్ అంతరాన్ని సమర్థవంతంగా తగ్గించడానికి వినూత్న పరిష్కారాలు, నియంత్రణ అమరిక సాంకేతిక పురోగతులు అవసరం. జాప్యాన్ని నివారించి ఇంటర్నెట్ వేగం విశ్వసనీయతను మెరుగుపరిచేందుకు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు చిన్న మరింత కాంపాక్ట్ పరికరాలను వినియోగదారులకు అందిస్తున్నారు. వీటికి మోడెమ్, వైర్‌లెస్ రౌటర్, నెట్‌వర్క్ కేబుల్‌తో మాత్రమే అవసరం. భవిష్యత్తులో ఇది చౌకగా అందించడానికి ప్రభుత్వాలు కృషి చేస్తాయని ఆశిద్దాం.

# కూటమి ప్రభుత్వం వాలంటీర్స్ వ్యవస్థను పునరుద్ధరించాలి

**వాలంటీర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి వెంకట్,**




**బద్వేల్ మార్చి 18 (ప్రజా జ్యోతి న్యూస్)** మార్చి18వ తేది నాడు గ్రామ,వార్డు సచివాలయ వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని, వాలంటీర్స్ వ్యవస్థపై అసెంబ్లీలో సాంఘిక సంక్షేమం, సచివాలయం, వార్డు వాలంటీర్స్ వ్యవస్థలు శాఖ మంత్రివర్యులు శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి గారు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి వెంకట్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబులు సంయుక్తంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ఐదు వేలు ఇస్తున్న గౌరవ వేతనాన్ని పది వేలు చెల్లిస్తామని చంద్రబాబు గారు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్న వాలంటీర్ల వ్యవస్థను పట్ల సరైన నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమని, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తాంని ఆశతో ఎదురు చూసిన వాలంటీర్లను నిరాశ పరుస్తూ సాంఘిక సంక్షేమం, సచివాలయం, వార్డు వాలంటీర్స్ వ్యవస్థలో మంత్రివర్యులు శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి గారు గత ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని ఉత్తర్వులు ఇవ్వలేదని, వాలంటీర్స్ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విధుల్లో లేరని విధుల్లో ఉండి ఉంటే మా ప్రభుత్వం ఆలోచన చేసేదని చెప్పడం సరైనది కాదని ఆ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలో రెండు లక్షల అరవై వేల మంది విద్యావంతులైన యువత యువకులు వాలంటీర్లుగా తమ సేవలను గత ఐదేళ్లలో కొనసాగించారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం టిడిపి కూటమి ప్రభుత్వం వాలంటీర్స్ వ్యవస్థ పునరుద్ధరణ పై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లను వీధుల్లోకి నెట్టి నిరుద్యోగుల ఉసురు తగిలేలా చేసుకోవద్దని,తక్షణమే వాలంటీర్ల వ్యవస్థపై తగు నిర్ణయం తీసుకోవాలని లేనిపక్షంలో రానున్న కాలంలో గ్రామ వార్డు వాలంటీర్ అందర్నీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ పట్టణ నాయకులు షేక్ షంషుద్దీన్ లు పాల్గొన్నారు.

# ముగిసిన పాలకొల్లు కళాపరిషత్ జాతీయస్థాయి నాటికల పోటీలు





**ఉత్తమ ప్రదర్శనగా చిగురు మేఘం.**

**ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా (అ)సత్యం, కిడ్నాప్ నాటికలు.**

**పాలకొల్లు. మార్చి 18. ప్రజా జ్యోతి. (కొట్టి రామం.)** పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో పాలకొల్లు బస్టాండ్ సెంటర్ లోని అడబాల థియేటర్స్ వెనుక గల ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదికపై ఈ నెల 15 నుండి మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించిన 16వ జాతీయస్థాయి నాటికల పోటీలు ముగిసాయి. ఈ పోటీలలో ఏడు నాటికలు ప్రదర్శించగా వాటిలో అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది . ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి (అ)సత్యం నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి కిడ్నాప్ నాటిక బహుమతులు పొందాయి. జ్యూరీ ప్రదర్శనగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మ స్వరూపం నాటిక బహుమతి సాధించింది..ఉత్తమ రచయితగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి నాటిక రచయిత వల్లూరు శివప్రసాద్ ప్రసాద్, ఉత్తమ దర్శకునిగా (అ)సత్యం నాటిక దర్శకుడు పీ బాలాజీ నాయక్ బహుమతి పొందారు .ఉత్తమ నటుడిగా చిగురు మేఘం నాటిక లో చెన్నయ్య పాత్రధారి కావూరి సత్యనారాయణ, ఉత్తమ నటిగా ఇది రహదారి కాదు నాటికలో సముద్రాలు పాత్రధారిణి బి నాగరాణి ,ఉత్తమ ప్రతినాయకుడిగా( అ)సత్యం నాటికలో రఘుపతి పాత్రధారి వై అనిల్ కుమార్ ఉత్తమ హాస్యనటునిగా మా ఇంట్లో మహాభారతం నాటికలో వాసుదేవరావు పాత్రధారి పి పండుబహుమతులు అందుకున్నారు. ద్వితీయ ఉత్తమ నటునిగా (అ)సత్యం నాటికలో శివయ్య పాత్రధారి పి బాలాజీ నాయక్ ద్వితీయ ఉత్తమ నటిగా కిడ్నాప్ నాటికలో వసుంధర పాత్రధారిని ఎస్ అమృత వర్షిని ఉత్తమ క్యారెక్టర్ నటునిగా విడాకులు కావాలి నాటికలో శ్రీనివాసరావు పాత్రధారి గంగోత్రి సాయి ఉత్తమ క్యారెక్టర్ నటిగా మా ఇంట్లో మహాభారతం నాటికలో అన్నపూర్ణ పాత్రధారిని ఎస్ జ్యోతి రాణి బహుమతులు పొందారు. .ఉత్తమ రంగాలంకరణ బ్రహ్మ స్వరూపం, ఉత్తమ సంగీత దర్శకుడు ( అ)సత్యం నాటిక పీ లీలామోహన్ ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ గా ఇది రహదారి కాదు నాటికకు పి గిరిధర్ , జూరి బహుమతి కిడ్నాప్ నాటికలో ఉదయ్ పాత్రధారి చిరంజీవి లోకేష్ ,మా ఇంట్లో మహాభారతం లో హరిచంద్ర రావు పాత్రధారి పి శ్రీహరి బహుమతులు పొందారు. ఈ నాటికలకు న్యాయం నిర్ణేతలుగా పంపన దయానంద బాబు (కాకినాడ ) గెద్ద వరప్రసాద్( విజయనగరం) గుత్తు చిన్నారావు (శ్రీకాకుళం) వ్యవహరించారు. అనంతరం పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణ వర్మ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభ జరిగింది సంస్థ ఉపాధ్యక్షుడు విటాకుల రమణ స్వాగతం పలుకగా మరో ఉపాధ్యక్షులు కేవస్పీఎన్ వర్మ సభను ప్రారంభించారు, సభాధ్యక్షులు కె.వి కృష్ణ వర్మ మాట్లాడుతూ పాలకొల్లు ప్రజలు, దాతలు సహాయ సహకారంతో ఈ పరిషత్ ను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కళాపరిషత్తులో చివరి రోజు ప్రదర్శించిన నాటికలకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మేకా శేషుబాబు ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, పాలకొల్లు జడ్పిటిసి నడపనగోవిందరాజులు నాయుడు సత్కరించి మెమొంటోలు అందజేశారు. నాటిక పోటీల అనంతరం ప్రత్యేక ప్రదర్శనగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన అనూహ్యం నాటికను కత్తుల రామమోహనరావు దర్శకత్వంలో నటీ నట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారు ప్రదర్శించారు. ఈ నాటిక ప్రేక్షకుల ప్రశంసలు పొందింది. అనంతరం కొనసాగిన సభా కార్యక్రమంలో తాడేపల్లిగూడెం బి వి ఆర్ కళాపరిషత్ అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు ,సినీ దర్శకులు కొంగరపి వెంకటరమణ ,సంస్థ గౌరవ అధ్యక్షుడు మేడి కొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ ,కార్యదర్శి జక్కంపూడి కుమార్ , కోశాధికారి కొనిజేటి గుప్త సహాయ కార్యదర్శి రెడ్డి వాసు కార్యవర్గ సభ్యులు షేక్ పీర్ సాహెబ్ సామంచి శ్రీనివాసరావు శాస్త్రి , నడపన శ్రీనివాసరావు ,అంగర వీరభద్ర కుమార్ కొల్లి కొండ ప్రసాద్ జివిఎస్ఎన్ఆర్ రవి వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ కొంతేరు యూత్ క్లబ్ కళాపరిషత్ అధ్యక్షులు అంబటి మురళీకృష్ణ , భీమవరం కళారంజని కళాపరిషత్ అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్ , రాయకుదురు శ్రీకృష్ణదేవరాయ నాటక పరిషత్ అధ్యక్షులు కె ఎస్ ఆర్ కె గోపాలకృష్ణ హరివిల్లు సంస్థ అధ్యక్షులు వంగా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్ వ్యవస్థను అటకెక్కించేసిన కూటమి ప్రభుత్వం...

**లక్షలాది కుటుంబాలు రోడ్లపాలు...**

**నమ్మించి నట్టేట ముంచడంలో చంద్రబాబు తర్వాతే ఎవరైనా ....**

**ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10000 వేతనంతో గడచిన 10నెలలు వేతనం చెల్లించాలి...**

**మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ..**



**పాతపట్నం మార్చి 19, ప్రజా జ్యోతి న్యూస్..** అధికారంలోకి వచ్చేందుకు ఎన్ని అబద్ధాలు చెప్పడానికైనా వెనుకాడని వ్యక్తి చంద్రబాబు నాయుడు అని మరోసారి నిరూపితమైంది. అధికారం కోసం అలవి కాని హామీలు ఇచ్చి ఇప్పుడు తీర్చలేక ప్రజలను మోసం చేస్తున్నారు. మరోవైపు.. ఎన్నికలకు ముందు వాలంటీర్లపై కపట ప్రేమ చూపించి అధికారంలోకి వచ్చాక.. వారిని నట్టేట ముంచేశారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మొదటి నుంచీ వాలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఎలక్షన్స్ ముందు కపట హామీలతో వాలంటీర్లను మభ్యపెట్టారు. చంద్రబాబు తేనే పూసిన కత్తికి బలైపోయి లక్షలాది మంది వాలంటీర్లు రోడ్డున పడ్డారు.ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు ఇతర సేవలను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. పెన్షన్ల నుంచి పౌరసరఫర సేవలతో పాటు ఇతర సేవలను ప్రజలకు నేరుగా అందేలా చూసేవాళ్లు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు వాలంటీర్లను నట్టేట ముంచేసారు వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన వాలంటీర్ల వ్యవస్థపై ఏపీ అసెంబ్లీలో, శాసన మండలిలో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో వాలంటీర్లు అసలు పని చేయడం లేదని అసెంబ్లీలో ఏపీ మంత్రి బాల వీరాంజనేయస్వామి చేసిన కామెంట్స్పై విడ్డూరంగా ఉందన్నారు. 2024 సెప్టెంబర్లో వరదలు వచ్చినప్పుడు వాలంటీర్లతో ఎలా డ్యూటీ చేయించారు, వాళ్లకి ఐడీలు ఎలా కొనసాగించారు. ఈ వ్యవస్థ లేకపోతే 2024లో మేనిఫెస్టోలో ఎలా పెట్టారు. ఎన్నికల్లో ఊరూరా తిరిగి వాలంటీర్ల జీతాలు పెంచుతామని ఎలా హామీ ఇచ్చారని ప్రశ్నించారు. 10 నెలలు కావస్తున్న వాలంటీర్స్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏమాత్రం మాట్లాడడం లేదన్నారు, అయితే వాలంటీర్స్ అందరిని ఉపాధి పోగొట్టి వాళ్ళ జీవన ఆధారం లేకుండా చేశారన్నారు. వాలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఎన్నికల్లో చెప్పి మోసం చేసి సుమారు 2.60 లక్షల మందిని తొలగించడం అన్యాయమని, వాళ్ళు ఉపాధి కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10000 వేతనంతో పెండింగ్ లో ఉన్న 10నెలలు వేతనం చెల్లించి వాలంటీర్ వ్యవస్థను తీసుకురావాలన్నరు.

# పురపాలక సంఘంలో సింగల్ యూజ్ పాస్టిక్ నియంత్రణ కు ప్రతి ఒక్కరూ సహకరించండి

**మున్సిపల్ కమీషనర్: నరసింహారెడ్డి**




**బద్వేల్ మార్చి 18 (ప్రజా జ్యోతి న్యూస్) :** సింగల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా ఈరోజు మోర్ సూపర్ మార్కెట్ ను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ కు బదులు బయోడిగ్రేడబుల్ కవర్ లు వాడడంతో మోర్ సూపర్ మార్కెట్ యాజమాన్యాన్ని అభినందించడంతో పాటు సిబ్బందినీ సన్మానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నీ సూపర్ మార్కెట్లు,కిరాణా షాప్ లు,చికెన్ మరియు మటన్ షాప్ లలో కూడా బయోడిగ్రేబుల్ కవర్ వాడాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు. అలాగే పంక్షన్ హాల్ నందు ప్లాస్టిక్ కోటింగ్ వున్న విస్తరులు,ప్లాస్టిక్ గ్లాస్ లు నిషేదించాలని, ప్రభుత్వం సూచించిన ప్రత్యామ్నాయాలు వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. బద్వేల్ పురపాలక సంఘం నందు ఎవరైనా సింగల్ యుజ్ ప్లాస్టిక్ వాడితే జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శానిటేషన్ సెక్రెటరీ లు తమ పరిధిలోని షాపులను తనఖీ చేస్తూ ప్లాస్టిక్ వాడకుండా వ్యాపారులకు,ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్ మునిసిపల్ అధికారులు మహేష్ ,సుధాకర్. ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిన కొత్తూరు మండల వైసీపీ నాయకులు..




**పాతపట్నం మార్చి 18, ప్రజా జ్యోతి న్యూస్..** రెడ్డి శాంతి నిరంకుశ వైఖరితోనే పార్టీని వీడాల్సి వచ్చింది.. స్థానికుడు,సామాన్యుడు,సేవా తత్పరుడైన ఎమ్మెల్యే ఎంజీఆర్ నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం.. పార్టీలో చేరిన వారిని పసుపు ఖండువాలతో సాదరంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఎంజీఆర్.. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిరంకుశ వైఖరి తోపాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు,స్థానికుడు, సమాన్యుడు, సేవా తత్పరుడైన ఎమ్మెల్యే ఎంజీఆర్ పనితీరుపై నమ్మకంతో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు కొత్తూరు మండల మాజీ వ్యవసాయ కమిటీ అధ్యక్షులు గోగుల వరప్రసాద్ నాయుడు తెలిపారు ఈరోజు విజయవాడలో స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు సమక్షంలో పారాపురం మాజీ ఎంపీటీసీ కుంచాల నూకరాజు,కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు,పారాపురం సర్పంచ్ ప్రతినిధి కుంచాల తవిటి నాయుడు,వార్డు సభ్యులు నారాయణరావు,కొమనాపల్లి హేమంత్ కుమార్,మూకాళ్ళ జనార్ధన,కొల్లి శంకరరావు తదితరులతో కలిసి పార్టీలో చేరారు,పార్టీలో చేరిన వారిని తెలుగుదేశం పార్టీ ఖండువాలతో సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే పాతపట్నం నియోజకవర్గానికి ముఖ్యంగా కొత్తూరు మండలంకు కీర్తిశేషులు గోగుల చల్లంనాయుడు చేసిన సేవలు ఎనలేనివని తన కుమారుడు సోదర సమానుడు వరప్రసాద్ నాయుడు టిడిపిలో చేరడం ఆనందంతో పాటు పార్టీ మరింత బలోపేతమైందని తెలిపారు కార్యక్రమంలో మాతల గాంధీ,అగతముడి మాధవరావు,అగతముడి అరుణ్ బాబు,టోంపల తిరుపతిరావు,చింతాడ కోటి తదితరులు ఉన్నారు..

# బి గోపాలపురం గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సహాయ సంచాలకులు..




**పాతపట్నం మార్చి 18, ప్రజా జ్యోతి న్యూస్** పాడి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్న గాలికుంటు వ్యాధి పట్ల పశుపోషకులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్ రావు కోరారు .మండలంలో బి గోపాలపురం గ్రామంలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఒకటో తారీకు నుండి 30వ తారీకు వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, నాలుగు మాసాల దాటిన ప్రతి పశువు కూడా టీకా వేస్తున్నట్లు చెప్పారు. నాలుగు మాసాల దూడలకు మళ్ళీ ఒక నెల తర్వాత బూస్టర్ డోస్ వేయ నున్నట్లు చెప్పారు . మండలంలో 13200 పశువులకు టీకాల లక్ష్యం కాగా 8 700 పశువులకు ఇప్పటివరకు టీకాలు వేసినట్లు చెప్పారు. మండలంలో నాలుగు టీంలు బృందాలుగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ టీకాలు తో పాటు బ్రూసిల్లా వ్యాధి టీకాలు కూడా నాలుగు మాసాలు దాటిన ఆడదూ డలకు వేస్తున్నట్లు చెప్పారు. కావున పశుపోషకులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఈ వ్యాధి ద్వారా వస్తున్న ఆర్థిక నష్టాన్ని నివారించుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నిరంజన్, మోహన్ ,శంకర్ , పరమేశ్వరి,ఉత్తమరావు మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో బిజెపిని బలోపేతం చేయాలి







**జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరాగ్రామస్థాయిలో బిజెపిని బలోపేతం చేయాలి జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు**

**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్. వీరబాబు** గ్రామ స్థాయిలో బిజెపిని బలోపేతం చెయ్యాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిని విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని రాచపల్లి జంక్షన్ సమీపంలో గెస్ట్ హౌస్ వద్ద ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విజయానికి బూత్ కమిటీలే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడ ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ విజయానికి ప్రధాన కారణం బూత్ కమిటీలే అన్నారు. నియోజకవర్గంలో 227 పోలింగ్ బూత్ లుకు 160 బూత్ కమిటీలు ఏర్పాటు చేసామన్నారు. త్వరలోనే మిగిలినవి ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో 1000 ఇళ్లలపై రాబోయే పక్షం రోజుల్లో బీజేపీ జెండాలు రెపరెపలాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షుడు కంద వీర స్వామి, గున్నా బత్తుల రాజబాబు, దేవర రామకృష్ణ యాదవ్, నానిపల్లి శ్రీనివాస్, గోనగానీ గోపి, రామకుర్తి సూర్యనారాయణ, తేజ మూర్తుల ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు గ్రామ స్థాయిలో బిజెపిని బలోపేతం చెయ్యాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిని విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని రాచపల్లి జంక్షన్ సమీపంలో గెస్ట్ హౌస్ వద్ద ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విజయానికి బూత్ కమిటీలే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ విజయానికి ప్రధాన కారణం బూత్ కమిటీలే అన్నారు. నియోజకవర్గంలో 227 పోలింగ్ బూత్ లుకు 160 బూత్ కమిటీలు ఏర్పాటు చేసామన్నారు. త్వరలోనే మిగిలినవి ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో 1000 ఇళ్లలపై రాబోయే పక్షం రోజుల్లో బీజేపీ జెండాలు రెపరెపలాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షుడు కంద వీర స్వామి, గున్నా బత్తుల రాజబాబు, దేవర రామకృష్ణ యాదవ్, నానిపల్లి శ్రీనివాస్, గోనగానీ గోపి, రామకుర్తి సూర్యనారాయణ, తేజ మూర్తుల ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు

## నేటి నుండి ఒక్కపూటే అంగన్వాడీ కేంద్రాలు

**– ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సి.డి.పి. ఓ ఎస్ అనురాధ**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి కాలం నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సందర్భంగా పొందూరు లో అంగన్వాడీ కేంద్రాలు నేటి నుండి ఒక్క పూట మాత్రమే నిర్వహించబడతాయని ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సి.డి.పి. ఓ ఎస్ అనురాధ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని అంగన్వాడీ కేంద్రాలు ఉంటాయన్నారు. వేసవి దృష్ట్యా మార్చి నెల 18వ తేదీ నుండి మే నెల 31వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాల సమయాన్ని మార్చినట్లు పేర్కొన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు వేడి ఆహారం ఇచ్చి పిల్లలను వారి వారి గృహాలకు పంపాలని ఆమె తెలిపారు.

## సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

**మునిసిపల్ కమీషనర్**




**బద్వేల్ మార్చి 18 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పురపాలక సంఘంలో నిర్దేశించిన దిగువ సచివాలయాలలో .గాంధీనగర్. మడకలవారి పల్లి. పూసలవాడ. కోటవీధి. గుంతపల్లె. సచివాలయాలలో రేపటి నుండి 22వ తేదీ వరకు మరియు 25 నుండి 28వ తేది వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 0-5 సం.రాల వయస్సు గల పిల్లలకు కొత్త ఆధార్ నమోదు, మరియు ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి బయోమెట్రిక్ అప్డేట్, అడ్రస్ మార్పులు, వయస్సు, పేరు మార్పు మరియు ఫోన్ నెంబర్ మార్పు వంటి సేవలను ఈ మొబైల్ క్యాంపులలో అందిస్తున్నారన్నారు. పట్టణ ప్రజలకు ఈ ఆధార్ సేవ క్యాంపులు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ తెలిపారు.

# పెనుమదంలో వైభవంగా జరిగిన అమ్మవార్ల జాతర.





**నేడు భారీ అన్న సమారాధన,**

**పాలకొల్లు. ప్రజా జ్యోతి ( కొట్టి రామం ) మార్చి.18.** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని పెనుమదంలో గ్రామ ప్రజలు తమ ఇలవేల్పులుగా భావించే చల్లాలమ్మ, మహాలక్ష్మమ్మ, గంట్లమ్మ, ధనకొండ్లమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల జాతర సోమవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యింది .మేళ తాళాలు,గరగల నృత్యాలు, వివిద కళారూపాల ప్రదర్శనలతో ప్రారంభమైన జాతర మంగళవారం సాయంత్రం వరకూ కొనసాగింది. గ్రామం లోని భక్తులు, ఆడపడుచులు, బంధువులు జాతరను తిలకించి అమ్మవార్లకు సల్విడి, పానకాలు చీరలను అందజేశారు. స్థానిక భక్తులతో పాటు మట్టపర్రు వేడంగి గుమ్మలూరు పరిసర గ్రామాల భక్తులు మహిళలు జాతరలో పాల్గొన్నారు. జాతర సందర్భంగా గ్రామం లోని అన్ని ప్రధాన వీధులలో విద్యుత్ తోరణాలతో అలంకరించారు. ప్రధాన ఆలయాన్ని పూల అలంకరణతో ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం నుండి భక్తులు అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అమ్మవార్లను ప్రధాన ఆలయానికి సాగనంపుతారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఈ నెల 19 బుధవారం ఉదయం భారీ ఎత్తున అన్న సమారాధన జరుగుతుందని కొలగారం కమిటీ చైర్మన్ కర్రే రామచంద్రరావు (పెద్దబ్బాయి )తెలిపారు. కమిటీ సభ్యులు దేవరపు దొరబాబు, కవురు నర్సింహామూర్తి తంగెళ్ల సత్యనారాయణ, సన్నిధి బదరీనారాయణ, దేవరపు వీరరాఘవులు, కట్టా మారేశ్వరరావు మాకా సాయిబాబు ముద్దాల నర్సింహారావు పెద్దిబోయిన సత్యనారాయణ గుబ్బల లక్ష్మీ నారాయణ ఆళ్ళ శాంతరాజు ఆలయ కార్య నిర్వాహణాధికారి పిల్లి సూర్యనారాయణ తదితరులు అన్నసమారాధన, అమ్మవార్లను సాగనంపటం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# ఏలేశ్వరం సిద్ధనాధ్ జ్యువెలరీలో జరిగిన చోరీ కేసును చేధించిన పోలీసులు

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ బిందు మాధవ్**





**కాకినాడ ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్.** గత నెల 9వ తేదీన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,ఏలేశ్వరం ప్రధాన రహదారిలో సిద్దనాద్ జ్యువెలరీ నందు జరిగిన చోరీని ప్రత్తిపాడు పోలీసులు చేధించారు.ఈ సందర్భంగా నిందితులను చోరీ సొత్తును మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ మాట్లాడుతూ ఏలేశ్వరం ప్రధాన రహదారిలో ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి సిద్దనాథ్ జ్యువెలరీ షాపులో జరిగిన చోరీ ఘటనపై పెద్దాపురం డిఎస్పీ శ్రీహరి రాజు ఆద్వర్యంలో ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి ఎస్ అప్పారావు తమ సిబ్బందితో కేసును ఛేదించారని తెలిపారు. ఈ ఘటనలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన కరణం కుమార్ %ూా%1 ముద్దాయిగా,కడప జిల్లా చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్యను %ూా%2గా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.వారి వద్ద నుండి ఒక పల్సర్ టూవీలర్ బైక్,11 కేజీలన్నర వెండి, 32.8 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని అన్నారు.%ూా% 1ముద్దాయి పై 30 దొంగతనం కేసులు ఉన్నాయని,%ూా%2 ముద్దాయిపై 11 ఎర్రచందనం కేసులతో పాటు 10 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు.నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు . సిద్ధనాద్ జ్యువెలరీ దొంగతనం కేసును చేధించిన సీఐ బి ఎస్ అప్పారావు,ఏలేశ్వరం ప్రత్తిపాడు,అన్నవరం రౌతులపూడి ఎస్సైలు ఎన్. రామలింగేశ్వరరావు,ఎస్ లక్ష్మికకాంతం,శ్రీహరి బాబు,జి. వెంకటేశ్వరరావులని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారని ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మీడియాతో తెలిపారు.

## జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల స్థాయి అధికారులు.



**పాతపట్నం మార్చి 18, ప్రజా జ్యోతి న్యూస్** ప్రాథమిక రంగా మిషన్లో నిర్దేశించిన లక్ష్యాలన్నిటిని ప్రతి ఒక్క శాఖ కచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ జిల్లా స్థాయి మరియు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల లక్ష్యాలు కచ్చితంగా సాధించి తీరాలని చెప్పారు. గృహ నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాలను మే 31 వ తారీకు లోపల సాధించి తీరాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ఒక మంచు కరుణాకర్ రావు , ఎంపీడీవో చంద్ర కుమారి, తాసిల్దార్ కిరణ్ కుమార్, ఈ ఓపిఆర్డి వెంకట్రావు, సిడిపిఓ విమల కుమారి, ఏ.పీ.ఓ సురేష్, ఎలక్ట్రికల్ ఏఈ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు...

## ఆల్ పార్టీ నాయకులతో రిటర్నింగ్ అధికారి సమావేశం.



**పాతపట్నం మార్చి 18, ప్రజా జ్యోతి న్యూస్ :** పాతపట్నం తహశీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ నాయకులతో రిటర్నింగ్ అధికారి,జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా సమావేశం నిర్వహించారు.కుటుంబ సభ్యుల ఓటర్ లిస్టు అంతా ఒక చోటు ఉండేటట్లు చేయాలని అన్నీ పార్టీల నాయకులు ఆయనకు కోరారు.అందుకు జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా ఓటరు లిస్ట్ అంతా సరిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐదు మండలాల తహశీల్దార్లు అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అమరజ్యోతి స్కూల్ లో యాన్యువల్ డే సెలబ్రేషన్స్ ..







**పాతపట్నం మార్చి 18, ప్రజా జ్యోతి న్యూస్** పాతపట్నం మండల కేంద్రంలో ఉన్న అమరజ్యోతి పాఠశాలలో మంగళవారం నాడు ప్రైమరీ తరగతులకు ఎన్యువల్ డే సెలెబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మండల విద్యాశాఖ అధికారులు ఎ.గోవిందరావు,సిహెచ్.తిరుమలరావు గవర్నమెంట్ హైస్కూల్ హెడ్మాస్టర్ ఎస్.వైకుంఠరావు, మహేంద్ర కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఆంజినేయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గెంబలి కాంతారావు,విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సోమేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.మురళీకృష్ణ ఉపాధ్యాయనీ, ఉపాద్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కిర్లంపూడిలో బిజెపి మండల కార్యవర్గ సమావేశం



**కిర్లంపూడి ప్రజా జ్యోతి రిపోర్టర్. రవి** కిర్లంపూడి మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి గ్రామంలో విజ్ఞాన భారతి స్కూల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త మండల అధ్యక్షుడు ఎన్నిక కొరకు అభిప్రాయ సేకరణ జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు,నియోజవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు,మట్టా మంగరాజు,కామినేని జయశ్రీ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కంటా కాశీ విశ్వనాథం,దొడ్డా అప్పారావు,శరకణం రాజబాబు,కోనేటి శ్రీనివాస్, బాలిన వెంకటేశ్వరరావు, బొడ్డేటి సత్య నారాయణ, ఐ వి వి సత్యనారాయణ, ఏనుగుపల్లి జలబాబు,మత్స వెంకటరమణ,గోడి లక్ష్మి, భువనగిరి కాశి విశ్వనాథం, అల్లు శివరామకృష్ణ,ఆడారి రామచంద్ర,భూమనాదుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మద్ది అంజన్న కు విశేష పూజలు..

**ప్రత్యేక అలంకరణలో స్వామివారి దర్శనం..**

**మంగళవారంసందర్భంగా దేవస్థానానికి పోటెత్తిన భక్తులు..**

**స్వామి వారి ఒక్క రోజు ఆదాయం లక్ష,18 వేలు..**



**జంగారెడ్డిగూడెం, మార్చి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు క్యూ లైన్ లో వేచి ఉండి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు జరుపుకున్నారు. తెల్లవారుఝామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు బారులుదీరి దర్శించుకొన్నారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు శ్రీస్వామి వారి ఆలయము చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ స్వామిని తమ కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు కొలుస్తారు. చాట్రాయి మండలం ఎర్రావారిగూడెంనకు చెందిన శ్రీ సీతారామాంజనేయ భజన సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మద్యాహ్నాం వరకు దేవస్థానానికి వివిధ సేవల రూపేణ 1,18,080 రూపాయిలు సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారిణి ఆర్వి చందన తెలిపారు. సుమారు 1400 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రం లో అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీ స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా దేవస్థానం పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి. చందన తెలిపారు.

# బయ్యారం బ్రిడ్జి కింద మహిళ శరీర భాగాలు..

**హత్య చేసిన మహిళ శరీర భాగాలను పడవేసిన దుండగులు..**

**వివిధ కోణాల్లో పోలీసు దర్యాప్తు..**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఇన్చార్జి ఎస్పి వకుల్ జిందాల్..**

**నిందితుల వేటలో 8 ప్రత్యేక బృందాలు..**



**అనకాపల్లి, మార్చి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, బయ్యవరం బ్రిడ్జి క్రింద గుర్తుతెలియని మహిళా శరీర భాగాలను పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక మహిళను దుండగులు దారుణంగా హత్య చేసి, ఆమె శరీరా భాగాలయిన, నడుము క్రింద భాగం (రెండు కాళ్లు) మరియు ఒక చెయ్యి వేరు చేసి, దుప్పట్లో చుట్టి పడేశారు. శరీర భాగాలు ఉన్న ప్రదేశాన్ని జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. దీనిపై నిందితులను అరెస్టు చేసేందుకు 8 ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజీలు, స్థానికుల సమాచారాన్ని విశ్లేషించి, నిందితులను గుర్తించే చర్యలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం తెలిసిన వెంటనే స్థానిక కశింకోట ఇన్స్పెక్టర్ స్వామి నాయుడు సెల్ నెంబర్ 94407 96088 లేదా డయల్ 100,112 కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా నిందితులు గుర్తించి త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.మహిళ మృత దేహం వయస్సు సుమారు 35 నుండి 40 సంవత్సరాలు ఉంటాయన్నారు. శరీర భాగాలపై ఉన్న గుర్తులు పోలీసులు వెల్లడించారు. కుడి తొడపై 1.5 అంగుళాల నల్ల మచ్చ, వెండి తొడుగులు,తెలుపు ఛాయ,కుడి చేతి మణికట్టుపై టాటూ, 4 బంగారు రంగు గాజులు పోలీసులకు లభించాయి.జిల్లా ఇన్చార్జి మరియు విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో పాటు అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి, ఇన్స్పెక్టర్లు స్వామి నాయుడు, విజయ్ కుమార్, అశోక్ కుమార్, కోటేశ్వరరావు, పైడుపునాయుడు, అప్పలరాజు మరియు అప్పలనాయుడు తదితర అధికారులు ఉన్నారు.

# వైద్య విద్యార్థులు పట్టుదలతో విద్యని అభ్యసించాలి..

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి..**

**వైద్య వృత్తి సేవాభావంతో ముడిపడి ఉంది**




**రాజమహేంద్రవరం, మార్చి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** వైద్య విద్యార్థులు పట్టుదల తో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, వైద్య వృత్తి సేవాభావంతో ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు.మంగళవారం స్థానిక మెడికల్ కాలేజీ లో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి ముఖ్యఅతిథిగా పాల్గొని , జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం వైద్య విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించడం శుభ పరిణామం అన్నారు. వైద్య విద్యార్థులు కష్టపడి చదువుకొని వైద్యులు అయిన తరువాత అంకితభావం తో, ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. వైద్య వృత్తి నోబెల్ ప్రొఫెషన్ అని కలక్టర్ కొనియాడారు. వైద్య విద్యార్థులు కష్టపడి చదువుకుంటూ బాధ్యతలు తెలుసు కుంటూ వైద్య సేవలు అందించేందుకు నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా "సౌభాగ్య రక్త మిత్ర" లోగోను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఒకరు రక్తాన్ని దానం చేయడం వల్ల ముగ్గురికి ప్రాణ దానం చేయవచ్చని తెలిపారు. వైద్యాధికారులు, వైద్య విద్యార్థులచే రక్తదాన ప్రతిజ్ఞ చేయించారు. సౌభాగ్య రక్త మిత్ర అభివృద్ధి చెంది ప్రజలకు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని తెలిపారు. వైద్య విద్యార్థులు మంచివైద్యాధికారులగా తయారయ్యి ప్రజలకు సేవ చేయాలని సూ చించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ వీక్ లో క్రీడల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మె డికల్ కాలేజ్, ప్రిన్సిపల్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ బి.సౌభాగ్య లక్ష్మి, జి జి హెచ్ ప్రభుత్వ ఆస్పటల్ సూపరింటెండెం ట్, డాక్టర్ ఎం. సూర్య ప్రభ, వైస్ ప్రిన్సిపల్, కే. శివప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ కే

సూర్యా రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి వి దుర్గా ప్రసాద్, ఆర్గనైజింగ్ టీం, డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా శక్తి మొబైల్ యాప్..

**జిల్లా ఎస్పీ తుషార్ డూడి..**

**శక్తి మొబైల్ యాప్" గురించి విస్తృత అవగాహన..**

**కళాశాలలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ముఖ్య కూడళ్ల లో శక్తి బృందాల అవగాహన..**



**బాపట్ల, మార్చి 18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** మహిళలకు అండగా "శక్తి మొబైల్ యాప్" ఉంటుందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి బృందాలు మంగళవారం రైల్వే స్టేషన్ లు, బస్టాండ్ లు, ఇతర ముఖ్యమైన కూడళ్లను, ప్రదేశాలను సందర్శిస్తూ మహిళలకు "శక్తి మొబైల్ యాప్" ప్రాముఖ్యత దాని ఆవశ్యకత గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళల మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా అండగా మీతో పోలీస్ ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ను ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసు బృందాలు వారు వున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా ఉంటాయన్నారు. శక్తి మొబైల్ యాప్ లో అనేక సేవలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. దీని ద్వారా నైట్ షెల్టర్ల వివరాలను, ఫ్యామిలి కౌన్సిలింగు, సేఫ్ ట్రావెల్, సమీపంలోని పోలీసు స్టేషన్ ల ఫోను నంబర్లు, హెల్ప్ లైను నంబర్లు, వాట్సాప్ గవర్నెన్స్ సేవలను పొందవచ్చునన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో యాప్ లోని సేఫ్ ట్రావెల్ ను ఆన్ చేసుకొంటే, వారు సురక్షితంగా గమ్య స్థానంకు చేరుకొనే వరకు వారి ప్రయాణంపై పోలీసు శాఖ నిఘా పెడుతుందన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే తక్షణ రక్షణ కోసం యాప్ లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే పోలీస్ బృందాలు వారికి రక్షణగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ మహిళ, విద్యార్థిని లు స్వచ్ఛందంగా తమ మొబైల్ ఫోన్ లలో తప్పనిసరిగా శక్తి యాప్ ను నిక్షిప్తం చేసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. శక్తి బృందాల ద్వారా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలను, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన కూడళు ్ళ, కళాశాలలు సందర్శించి, మహిళలకు, విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 5 శక్తి బృందాలు ఉన్నాయన్నారు. ప్రతి బృందానికి ఎస్ఐ నాయకత్వం వహిస్తున్నారన్నారు. మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, యాప్ పనితీరు పట్ల మహిళలకు అవగాహన కల్పిస్తాయని ఎస్పి తెలిపారు.

## వేంకటేశ్వర స్వామి వారి చక్ర స్నానాల వేడుక కార్యక్రమంలో పాల్గొన్న లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు..



**పాతపట్నం మార్చి 18 ,ప్రజాజ్యోతి న్యూస్** కొత్తూరు కేంద్రంలో వేంకటేశ్వర స్వామి వారి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామీ వారికి ప్రత్యేక పూజలు, కళ్యాణ మహోత్సవం, పూర్ణ హుతి, చక్ర స్నానాలు మొదలగు కార్యక్రమాల్లో పాల్గొని స్వామీ వారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామీ వారి సేవ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, రేగేటి కన్నయ్య స్వామీ, కోయిలాపు సంజీవరావు, వంజరాపు వెంకటరమణ మొదలగు వారు ఉన్నారు.

## ఫోటో సెషన్ లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్..



**పాతపట్నం మార్చి 18 ప్రజా జ్యోతి న్యూస్** ఏపీ అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు , మంత్రులు,ఎమ్మెల్యేలతో కలిసి ఫోటో సెషన్ లో పాల్గొన్న పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ..

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యులకు శాసనమండలి సభ్యులకు జరుగుతున్న క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజిఆర్..



**పాతపట్నం మార్చి 18 ప్రజా జ్యోతి న్యూస్** విజయవాడ మున్సిపల్ స్టేడియం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యులకు, శాసనమండలి సభ్యులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో పాల్గొన్న పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు. ఈ క్రీడా పోటీల్లో సహచార శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తూరు మండలంలో బీజేపీ పార్టీలోకి పలువురు చేరికలు.



**కొత్తూరు మార్చి 18, ప్రజా జ్యోతి న్యూస్** పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు మండలంలో మహర్తాపురం, ఉప్పరపేట, గూనభద్ర గ్రామస్తులు సుమారుగా 15 కుటుంబాలు సోమవారం నాడు బీజేపీ పార్టీలోకి చేరారు. వీరిని బీజేపీ పార్టీ లోకి బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు స్వయంగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల అధ్యక్షులు బూరాడ భాస్కరరావు, జాన్ కటారి, ఎండు మాస్టర్, నాగేశ్వరావు, ఆనంద్, ఉపేంద్ర, పొగిరి గోపాల్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చింతాడ రాజశేఖర్ కు ప్రశంసా పత్రం

**ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ సమావేశం లో ప్రశంసా పత్రాన్ని అందుకున్న చింతాడ**



**ఎచ్చెర్ల ,ప్రజా జ్యోతి న్యూస్ :** ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా వారు ఆంధ్రప్రదేశ్ చాప్టర్ సమావేశాన్ని విజయవాడ లో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి,యువతకు తోడ్పాటు కొరకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ. ఈ.ఐ ఎలక్ట్రానిక్స్ విభాగపు రాష్ట్ర కమిటీ సభ్యులు , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో శ్రీకాకుళం లో ఐ.ఈ.ఐ కేంద్ర కార్యాలయం ఏర్పాటు గురించి చర్చించారు. ఈ సందర్భంగా చింతాడ రాజశేఖర్ ను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఐ. ఈ. ఐ చైర్మన్,డాక్టర్ దేవకుమార్ , పూర్వపు చైర్మన్ డాక్టర్ శ్రీరామ్ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈయన సేవల పట్ల యూనివర్శిటీ ప్రొఫెసర్లు , సిబ్బంది,విద్యార్థులు ,పలువురు ప్రజాప్రతినిధులు అభినందలు తెలిపారు

# అధిక ఓటర్లు ఉన్న పోలీస్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి..





జిల్లా కలెక్టర్ వెంకట మురళి..
పోలింగ్ కేంద్రాలు భజనపై సమీక్ష..
1200 మించి ఓటర్లు ఉంటే మరో కేంద్రం ఏర్పాటు..
ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి..
ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి..
అధికారులకు కలెక్టర్ ఆదేశాలు..

**బాపట్ల, మార్చి 18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల విభజనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. పోలింగ్ కేంద్రాల విభజనపై రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో స్థానిక కలెక్టరేట్లో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,200లకు మించి ఓటర్లు ఉండరాదనే నిబంధనలను ఉల్లంఘించారాదని కలెక్టర్ చెప్పారు. 1,200 కు పైగా ఓటర్లు ఉంటే మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల విభజన ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో 12,91,415 ఓటర్లు ఉన్నారన్నారు. అందులో 6,29,578 మంది పురుష ఓటర్లు ఉండగా, 6,61,756 మంది మహిళ ఓటర్లు ఉన్నారని, మిగిలిన 81 మంది ఇతర ఓటర్లు అన్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 1,510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1,100 ఓటర్లు లోపు అన్న పోలింగ్ కేంద్రాలు 1,270 ఉన్నాయన్నారు. 1,101 ఓటర్లకు మించిన పోలింగ్ కేంద్రాలు జిల్లాలో 250 ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఒక వెయ్యికి మించి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలన్నింటిని గుర్తించి విభజించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అలాగే రెండు కిలోమీటర్లకు మించి పోలింగ్ కేంద్రం ఓటర్లకు దూరంగా ఉండకూడదు అన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఎన్నికల అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాల్సి ఉందన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో ప్రతినెల నియోజకవర్గం, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిశీలించి, వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటు హక్కు కోసం జనవరి నుంచి ఇప్పటివరకు 2,399 దరఖాస్తులు రాగా, 382 పెండింగ్లో ఉన్నాయన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అధికారులు స్పృహతో పని చేయాలని హెచ్చరించారు. జిల్లాలో 319 మంది ఓటర్లు విదేశాల్లో ఉంటున్నారని చెప్పారు. 2,187 మంది విఐపి ఓటర్లు ఉండగా, దివ్యాంగ ఓటర్లు 14,551 మంది ఉన్నారని చెప్పారు. 4,532 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని వివరించారు. ప్రతి ఓటరుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఆధార్ అనుసంధానంలో 1.92 లక్షల ఓట్లు పెండింగ్లో ఉన్నాయని చెప్పారు. తక్షణమే పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బి ఎల్ ఓ లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, బిజెపి నాయకులు రామకృష్ణ, సిపిఎం నాయకులు గంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బాలాజీ, బి.ఎస్.పి నాయకులు కోటేశ్వరరావు, టిడిపి నాయకులు షేక్ గౌస్ బాషా, వైసిపి నాయకులు ఐ మాల్యాద్రి, జనసేన నాయకులు శివ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్...
# స్పోర్ట్స్‌లో పాల్గొన్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు





**బాపట్ల జిల్లా మార్చి 18 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన ఏపీ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ %-% 2025 పోటీల్లో సహచర ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లతో కలిసి బాపట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు.క్రీడా పోటీలను సభాపతి అయ్యన్న,ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం చాలా సంతోషదాయకం అని తెలిపారు గతంలో ఎన్టీఆర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ క్రీడా సాంప్రదాయం నేడు కూటమి పాలనలో మరోసారి ప్రారంభం కావడం శుభపరిణామం అని చెప్పారు క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు, ప్రజాప్రతినిధుల మధ్య ఐక్యత పెంపొందుతుందని పేర్కొన్నారు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు మూడు రోజుల పాటు ఇలాంటి కార్యక్రమాలు ఆటవిడుపుగా ఉంటాయని,మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు.లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా సహచర శాసనసభ్యులతో కలిసి సరదాగా గడపడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు అనంతరం సహచర ఎమ్మెల్యేలతో పాటు ఫోటోలు కార్యక్రమంలో పాల్గొన్నారు

## పవన్, లోకేశ్ కు కీలక బాధ్యతలు

**విజయవాడ**

చంద్రబాబుదూకుడుగా ఉన్నారు. దూకుడు మీద నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఒకవైపు పాలనను పరుగులు ఎక్కిస్తూనే మరోవైపు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఇంకోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భావిస్తున్నారు. ఏకకాలంలో ఈ పనులన్నీ పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణ పనులను శరవేగంగా జరిపించాలన్న ప్రయత్నంలో ఉన్నారు. ఇంకోవైపు పోలవరం ప్రాజెక్టు పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం పవన్తో పాటు మంత్రి లోకేష్ కు ఆయన కొన్ని రకాల బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. వీలైనంతవరకూ రాజకీయ అంశాలకు సంబంధించి ఆ ఇద్దరు నేతలకు బాధ్యతలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.కూటమి ప్రభుత్వానికి హనీమూన్ ముగిసింది. ఇప్పటికే అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. అందుకే ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు పాలనను అందించాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు మరింత చేరువు కావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో మే నెల నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని చూస్తున్నట్లు సమాచారం. నిధుల సమీకరణతో పాటు కేంద్రంతో సమన్వయానికి చంద్రబాబు విలువైన సమయాన్ని కేటాయిస్తారని తెలుస్తోంది.మరోవైపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి బలంగా వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. రాజకీయంగా కూడా కూటమికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. ఇంకో వైపు టిడిపి, జనసేన మధ్య విభేదాలు ప్రారంభమైనట్లు కనిపిస్తున్నాయి. ఇటువంటి సమయంలో చంద్రబాబు పూర్తిస్థాయిలో రాజకీయ అంశాలపై దృష్టి పెట్టె పరిస్థితి లేదు. అందుకే జనసేన నుంచి పవన్, టిడిపి నుంచి లోకేష్ రాజకీయ అంశాలకు సంబంధించి బాధ్యతలు తీసుకుంటారని తెలుస్తోంది. ఇప్పటికే పవన్ కళ్యాణ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో ఒకటికి రెండుసార్లు పార్టీ శ్రేణులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీతో ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించుకుందామని.. మరోసారి జగన్మోహన్ రెడ్డికి చాన్స్ ఇస్తే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని కూడా పవన్ హెచ్చరించారు.
.అదే సమయంలో లోకేష్సైతం టిడిపి శ్రేణులను కట్టడి చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి మరో 15 ఏళ్లపాటు కొనసాగాలని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. దానిని చెప్పే పరిస్థితి ఉండకూడదని లోకేష్ సైతం పార్టీ శ్రేణులను సర్దుబాటు చేస్తున్నారు. ఎన్నికలకు ఇంకా నాలుగు సంవత్సరాల సమయం ఉంది. రెండు పార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించే అవకాశం ఉంది. అందుకే తెలుగుదేశం పార్టీ పరంగా ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు లోకేష్ తనవంతుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికివారుగా తమ పార్టీలను బలోపేతం చేస్తూనే.. సమన్వయంతో ముందుకెళ్లాలని భావిస్తున్నారు. ఈ విషయంలో చంద్రబాబు ఆ ఇద్దరు నేతలకు బాధ్యతలు అప్పగించారు. మరి వారు ఎంతవరకు వర్కౌట్ చేస్తారో చూడాలి.

## టెస్లా అమ్మకానికి కార్లు సిద్ధం

**ముంబై :** ప్రపంచ కుబేరుడు అయిన ఎలాన్ మస్క్ సంస్థ అయిన టెస్లా కంపెనీ కార్ల అమ్మకానికి భారత్ లో రంగం సిద్ధం అయింది. ఇందులో భాగంగా ఇప్పటికే ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లోని సుమారు 4వేల చదరపు అడుగులకు పైగా ఆస్తిని లీజుకు తీసుకుంది. ఇందులోనే టెస్లా కొత్త కార్ల షో రూం ప్రారంభించనుంది. ఈ షో రూం నెలవారీ అద్దె కోసం రూ.35,26,665 చెల్లిస్తుంది. కంపెనీ రూ. 2,11,59,990సెక్యూరిటీ డిపాజిట్ కూడా చెల్లించింది. ఈ నేపథ్యంలో టెస్లా ఇండియాలోకి ప్రవేశం అనేది లాంఛనం అని చెప్పవచ్చు. దీంతో దీనికి సంబంధించి అన్ని సన్నాహాలు చేస్తుంది సంస్థ. తాజాగా ఇండియాలో రెండు ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల కోసం సర్టిఫికేషన్, హోమోలోగేషన్ ప్రక్రియను కూడా ప్రారంభించింది. దేశంలో కార్లను అమ్మే ముందు సర్టిఫికేషన్, హోమోలోగేషన్ ప్రక్రియ తప్పనిసరి.అందుకనే టెస్లా ఇండియా మోటార్ అండ్ ఎనర్జీ ప్రై.లిమిటెడ్ ఇండియాలో మోడల్ వై, మోడల్ 3 కార్ల హోమోలోగేషన్ ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకుంది.హోమోలోగేషన్ అనేది ఒక వాహనం రోడ్డు మీద ప్రయాణించడానికి యోగ్యమైనదని.. ఇండియాలో తయారు చేసిన లేదా దేశంలోకి ఇంపోర్ట్ చేసుకున్న అన్ని వాహనాలకు విధించిన నిబంధనలకు అనుగుణంగా ఉందని ధృవీకరించే ప్రక్రియ. కేంద్ర మోటారు వెహికల్ రూల్స్ కు అనుగుణంగా ఉద్గారం, సేఫ్టీ, రోడ్డు యోగ్యత పరంగా వెహికల్ ఇండియా మార్కెట్ అవసరాలకు సరిపోతుందని సదరు ప్రభుత్వ శాఖ నిర్ధారించాలి.ప్రపంచంలోనే భారత్ మూడో అతి పెద్ద కార్ల మార్కెట్. అమెరికాన్ కంపెనీ టెస్లా అడుగుపెట్టడానికి ట్రై చేస్తూనే ఉంది. దీనికి సంబంధించిన ఇరుపక్షాల మధ్య ఒప్పందాలు పూర్తయ్యాయి.కాబట్టి త్వరలోనే టెస్లా కార్లు మన దేశంలోకి అమ్మకానికి రాబోతున్నాయి. అయితే టెస్లా తయారీ ప్లాంట్ ఇండియాలో ప్రారంభిస్తారా?.. లేదా? అనే దానికి సంబంధించిన వివరాలు ప్రస్తుతానికి అందుబాబులో లేవు. ప్రస్తుతం అమెరికాలో టెస్లా చౌకైన కారు.. 'మోడల్ 3' ధర ఫ్యాక్టరీ స్థాయిలో దాదాపు 35,000 డాలర్లు (భారత మార్కెట్లో సుమారు రూ.30.4 లక్షలు). ఇండియాలో దిగుమతి సుంకాలను 15-20 శాతానికి తగ్గించడంతో పాటు, రోడ్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ వంటి అదనపు ఖర్చులతో కలిపి ఆన్-రోడ్ ధర 40,000 డాలర్లు లేదా దాదాపు రూ. 35నుంచి 40 లక్షలుగా తయారైంది. టెస్లా మోడల్ వై ధరలు రూ.70 లక్షల నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు మైక్ సెట్లు పంపిణీ





**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు..** వెనుకబడిన దేవాలయాలకు దానధర్మ ట్రస్ట్ వారిచే మైక్ సెట్లు ఇవ్వడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యురాలు నేదూరి జయలక్ష్మి అన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ మరియు ప్రత్తిపాడు మండలం టి రాయవరం గ్రామాల్లో రెండు మైక్ సెట్లు బహుకరించడం జరిగిందని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామదేవతల ఆలయాలు బాగు చేసుకుందామని,మన హిందూ ధర్మాన్ని సంస్కృతిని కాపాడుకోవాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శివ,సతీష్ పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురు అరెస్ట్..

**363 కేజీల గంజాయి, రెండు కార్లు స్వాధీనం..**





**సబ్బవరం, మార్చి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** అనకాపల్లి జిల్లా సబ్బవరం పోలీస్ స్టేషన్ పరిధి మర్రిపాలెం టోల్గేట్ వద్ద గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఏడుగురు వ్యక్తు లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 363 కేజీలు గంజాయి , రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు కు సంబంధించి వివరాలు పరవాడ డి.ఎస్.పి వి విష్ణు స్వరూప్ మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం నిందితులలో 6 గురు ఏ.ఎస్.ఆర్. జిల్లాకు, ఒకరు ఒడిశాకు చెందిన వారు ఉన్నారు. ఈ గంజాయి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు నుండి పూణెకు రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు, గంజాయి, ఫోన్లు, నగదు విలువ 57.10 లక్షలు గా తెలిపారు. సమావేశంలో సబ్బవరం ఇన్స్పెక్టర్ పి.రమణ, ఎస్సైలు పి.సింహాచలం, టి.దివ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానం..

**బాపట్ల, మార్చి 18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ప్రకాశం జిల్లా డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ పరిదిలోని ప్రకాశం జిల్లాతో పాటు అద్దంకి , మార్టూరు,పర్చూరు చీరాల ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులు (కాంట్రాక్ట్ / ఔట్ సోర్సింగ్ పద్ధతిలో) ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులు కోరారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన తమ దరఖాస్తులను జిల్లా సమన్వయాధికారి, డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ (పాత రిమ్స్, ప్రకాశం భవనం ఎదురు) వారి కార్యాలయంలో ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు అందజేయాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ జిల్లా కోఆర్డినేటర్ (ఫోన్ నెంబర్ 98 491 142 77) ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు జిల్లా %షవఎంౘవ జూత్పుఝుఝఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ% లో పొందుపరిచినట్లు తెలిపారు.

## అన్నవరం స్వామి ని దర్శించుకున్న కలెక్టర్..



**అన్నవరం, మార్చి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** అన్నవరంశ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని జిల్లా కలెక్టర్ సణ్ముహన్ మంగళవారం దర్శించుకున్నారు. దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం ఆలయ అధికారులతో రెండో మారు రత్నగిరిను పరిశీలించారు.గతంలో దేవాదాయ శాఖ నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం కు భక్తులు ఇచ్చిన తీర్పులో చిట్టా చివరి స్థానం ఇవ్వడంతో గత కొన్ని రోజుల క్రితం దేవస్థాన పరిసరాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసి వెళ్లారు.ఈ విషయంపై మరో మారు అన్నవరం దేవస్థానం కు కలెక్టర్ వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా కొండ దిగువనగల పంప నదిలో జలాలు అడుగట్టడంతో దేవస్థానానికి ఉపయోగించే బోరులను పలుమార్లు మొరాయిస్తున్నాయని దేవస్థాన అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో పంపానది తీరానికి చేరుకుని కలెక్టర్ సన్మోహన్ అక్కడ ఉద్యోగులకు పలు సూచనలు సలహాలు ఇచ్చి అతి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా కొండపైగల భక్తులు వాడే మరుగుదొడ్లను పారిశుద్ధ్యమును పరిశీలించి చివరగా ఆలయ అధికారి యంత్రంగానికి ఆలయ పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు.

# మండలిలో కవిత వర్సెస్ పొన్నం


**హైదరాబాద్ :** తెలంగాణ శాసన మండలిలో తులం బంగారం అధికార, విపక్షాల మధ్య మాటల మంటలు రేపింది. తెలంగాణ మహిళలను మోసం చేశామని స్వయంగా ప్రభుత్వం అంగీకరించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. మహిళా వ్యతిరేక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సిఎం దురుసుగా మాట్లాడడమే కాకుండా ఈ రోజు స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయబోమని చెప్పడమేంటంటూ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ కళ్యాణమస్తు పథకం. ఈ పథకంలో భాగంగా పెండ్లి సందర్భంగా ఆడపిల్లలకు రూ. లక్ష రూపాయల డబ్బుతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. అయితే ఎప్పుటి నుంచి మీరు చెప్పిన తులం బంగారం ఇస్తారని శాసన మండలిలో కవిత ప్రశ్నించారు. మీరు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ జరిగిన వివాహాలకు కూడా తులం బంగారం ఇస్తారా అని మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు కవిత. కవిత ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ.. కళ్యాణమస్తు పథకాన్నిఅమలు చేసే ఆలోచన లేదని తెలిపారు. దీంతో ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలిలో జరిగిన తులం బంగారం రచ్చపై బయటకు వచ్చిన తరువాత కవిత మీడియాతో మాట్లడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలతో రెచ్చిపోయారు. కాంగ్రెస్ మెనిఫెస్టో చిత్తుకాగితమని తేలిపోయిందని, ప్రజలను, ముఖ్యంగా మహిళలను మోసం చేయడానికే ఇష్టానుసారం కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చి,ఇప్పుడు చేతులెత్తేస్తున్నారని విమర్శించారు.సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీతతో సమానం అని పదే పదే అన్నారు, కానీ అవన్నీ అబద్దాలేనని శాసన మండలి సాక్షిగా



తేలిపోయిందాన్నరు కవిత. కళ్యాణమస్తు పథకమే కాకుండా మహిళలకు నెలకు 2500 ఇస్తామన్న హామీ, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామన్న హామీలు అమలుపై అనుమానాలు నెలకొన్నాయని తెలిపారు. ప్రభుత్వ వైఖరి చూస్తే మహిళలను చిన్నచూపు చూస్తున్నట్లు కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు తప్పకుండా బుద్ధిచెబుతారని హెచ్చరించారు. మరోవైపు తెలంగాణలో మిర్చి పంటకు రూ. 25 వేలు కనీస మద్ధతు ధర ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మిర్చి ధరలు పడిపోయి రైతులు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి నిరసనగా సహచర బీఆర్ఎస్ ఎమ్మెల్సీలతో కలిసి ఎమ్మెల్సీ కవిత శాసన మండలి ఆవరణలో ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎండు మిర్చి దండలను మెడలో వేసుకొని ఎమ్మెల్సీలు వినూత్నంగా నిరసన తెలియజేశారు. మిర్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. నాఫెడ్, మార్క్ ఫెడ్ వంటి సంస్థ ద్వారా ప్రభుత్వమే మిర్చి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు పంటకు కూడా రూ. 15 వేల మేర కనీస మద్ధతు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. సుగంధ ద్రవ్యాల బోర్డు పరిధిలోకి మిర్చి పంటను కూడా తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్నికోరారు కవిత.

# పది పరీక్షకు అంతా సిద్ధం

**హైదరాబాద్ :** ఈ నెల 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల ఏర్పాటు, కేంద్రాల్లో వసతుల కల్పన తదితర అంశాలపై జిల్లాల విద్యాశాఖాధికారులు దృష్టిపెట్టారు. ఇప్పటికే జిల్లాల్లో డీఈవోలు పరీక్షా కేంద్రాలను గుర్తించారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షల ఏర్పాట్లపై ఫిబ్రవరిలో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్‌లు సమీక్షించారుపరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను, కస్టోడియన్లు, ఇన్విజిలేటర్లను నియమించారు. కేంద్రానికో ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక పోలీసు అధికారి, ఇద్దరు అటెండర్లను నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. ఇందులో విద్యా, రెవెన్యూ, పోలీసు శాఖల నుంచి ఒక్కొక్కరు ఉంటారు. సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్లు పరీక్ష సరళిని తనిఖీ చేస్తారు.ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ ఉండే గదిలో నిఘానేత్రాలను పెట్టించారు. పరీక్ష సమయానికంటే 15 నిమిషాల ముందు నిఘానేత్రం పర్యవేక్షణలోనే ప్రశ్నపత్రాల కట్టలను తెరవాల్సి ఉంటుంది. సీసీ కెమెరాలు లేని కేంద్రాల్లో అమర్చుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు ఉన్నతాధికారులకు చెప్పారు. పరీక్షలకు సంబంధించిన ఏమైనా ఇబ్బందులున్నా, ఫిర్యాదు చేయాలన్నా కంట్రోల్‌రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలి.కొన్నిచోట్ల ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. దీనిపైనా విద్యాశాఖ అధికారులు స్పందించారు. డీఈవో కార్యాలయాలకు విద్యార్థులందరి హాల్‌టికెట్లు వచ్చాయని చెబుతున్నారు. వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించారు. ఏ పాఠశాలలోనైనా



విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. లేదంటే బీఎస్ఈ.తెలంగాణ. జీవోవి.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తీసుకొచ్చినా అనుమతిస్తామని స్పష్టం చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రిన్సిపాళ్ల సంతకం అవసరం ఉండదని అంటున్నారు.పదో తరగతి పరీక్షల్లో నిమిషం నిబంధన ఏమీ లేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అలా అని ఆలస్యంగా రావొద్దని స్పష్టం చేస్తున్నారు. విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకుంటే మంచిదని సూచిస్తున్నారు. కేంద్రాలను ఒకరోజు ముందే చూసుకుంటే మేలు అని చెబుతున్నారు.

# బీఆర్ఎస్ కు సీతక్క కౌంటర్

**హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లుపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతల తీరు అపరిచితుడు సినిమాలా కనిపిస్తుందని సెటైర్లు వేశారు. ఉదయం రాము.. రాత్రి రేమోగా మారినట్లుగా బీఆర్ఎస్ నేతల వ్యవహార శైలి ఉందన్నారు. ఉదయం పూట రిజర్వేషన్ల పెంపు బిల్లుకు సంపూర్ణ మద్దతూ ప్రకటించిన బిఆర్ఎస్ సాయంత్రం కాగానే సన్నాయి నొక్కులు నొక్కుతోందన్నారు. ఈటెల రాజేందర్ పైన కోపంతో ముదిరాజులకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణనకి బీఆర్ఎస్ మొదటి నుండి వ్యతిరేకమే. పదేళ్ల అధికారంలో ఉండి మైనార్టీ, ఎస్టీ రిజర్వేషన్లను పెంచలేదు. ఎన్నికల సమయంలో అధికారం కోల్పోయే ముందు ఎస్టీ రిజర్వేషన్లను పెంచినట్లు డ్రామా చేశారు. దివంగత ప్రధానులు రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ దేశం కోసం ప్రాణాలు త్యాగం చేశారు. కానీ అలాంటి నేతలు రిజర్వేషన్లకు వ్యతిరేకమని బీఆర్ఎస్ అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. రాహుల్ గాంధీ ఆలోచన విధానంతో కులగణన చేపట్టాం. దానిపై ముందుకు సాగుతున్నాం. అన్ని రకాల న్యాయ నిపుణులు సలహాలు సూచనలు తీసుకున్న అనంతరం తెలంగాణలో కులగణన చేశాం' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.బీఆర్ఎస్ తో పాటు బిజెపి వాళ్ళు ఇది సాధ్యం కాదని అంటున్నారు. బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదని మొన్న ఈటెల రాజేందర్ మాట్లాడుతూ అన్నారు. అంటే బీజేపీ నేతలు ముందే ప్రిపేర్ అవుతున్నారు. జనాభా ప్రాతిపదికన బడుగు బలహీనవర్గాలకు అవకాశం కల్పించాలని రాహుల్ గాంధీ చెప్పారు. బీసీ కుల గణన చేపట్టిన కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్డీయే ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని




మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు.

ప్రధాని మోదీకి రేవంత్ లేఖ

తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లును కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. తెలంగాణ శాసనసభ సోమవారం నాడు బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లును ఆమోదించింది. ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, కానీ అది కేంద్రం పరిధిలో ఉందని.. చట్ట సవరణ బాధ్యత కేంద్రానిదే అని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బీసీలకు విద్య, ఉద్యో, రాజకీయ అంశాల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్నది తెలంగాణ ప్రభుత్వం ఉద్దేశం అని చెబుతున్నారు. దీనిపై ప్రధాని మోదీని కలిసి బీసీలకు న్యాయం చేయాలని రేవంత్ రెడ్డి కోరనున్నారు. ఈ మేరకు అపాయింట్ మెంట్ ఇవ్వాలని కోరుతూ ప్రధానికి రేవంత్ లేఖ రాశారు. రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం ఆమోదముద్ర వేయాలి. లేకపోతే రిజర్వేషన్ అమలు చేయడం వీలుకాదు.

## కాంగ్రెస్ ఛారిత్రాత్మక నిర్ణయం.

## టీ బీసీ జేఏసీ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్.

**జగిత్యాల :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రం లోని టీ బీసీ జేఏసీ భవన్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు.తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని,బీసీ సంక్షేమ మంత్రి శాసనసభ లో అన్నట్లుగా బీసీ వర్గాలు వెనుక బడిన వర్గాలు కావు..వెన్నెముక వర్గాలేనన్నారు. రిజర్వేషన్ల పెంపుకు రాజ్యాంగ సవరణ చేయించేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. తమిళనాడు లో రిజర్వేషన్లను రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్ లో చేర్చినట్లు తెలంగాణ బీసీ రిజర్వేషన్లను కూడా చేర్చాలని టీ బీసీ జేఏసీ తరపున కేంద్రాన్ని కోరుతున్నాం.పార్లమెంట్ లో ఆమోదం పొంది చట్టసభలు,విద్య,ఉద్యోగ రంగాల్లోని 42 శాతం అవకాశాలు దక్కితే హర్షిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండా లక్ష్మణ్,కార్యదర్శి ములస్తం శివ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బండారి విజయ్,ఉపాధ్యక్షుడు సింగం భాస్కర్,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వెల్ముల ప్రకాష్ రావు,సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్,లీగల్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, మహిళా జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి,జగిత్యాల పట్టణ అధ్యక్షురాలు సింగం పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి

## మహిళా కమిషన్ సమన్లు

**హైదరాబాద్ :** ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వ్యాఖ్యలపై మహిళా కమిషన్ సీరియస్ అయింది. ఎస్టీ మహిళా కార్పొరేటర్ సుజాత నాయక్ పై అసభ్యకర వ్యాఖ్యలకు చేసిన ఎల్. బి నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పై మహిళా కమిషన్ లో ఫిర్యాదు చేసారు. జి.హెచ్. యం. సి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద కలసి బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పై ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ కార్పొరేటర్లు. మహిళా కార్పొరేటర్ సుజాత నాయక్ మధు యాష్కి తో హనీమూన్ కి వెళ్లారు అని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మహిళా కమిషన్ సీరియస్ గా తీసుకున్నారు. కమిషన్ ముందు హాజరు కావాలంటూ బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి మహిళా కమిషన్ సమన్లు జారీ చేసింది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న మహిళా కార్పొరేటర్ పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అంటే మహిళా లోకాన్ని అగౌరవ పరచడమే అంటూ మహిళా కమీషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా కమిషన్ ముందు కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ బోరుమని ఏడ్చారు.

## అప్లయ్..అప్లయ్ నో రిప్లయ్ :

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

నేనే సీనియర్.. నాకు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన ఆయన అప్లయ్..అప్లయ్ నో రిప్లయ్ అన్నట్లుగా ఇక్కడ నడుస్తోందని అన్నారు. తనకు తెలియకుండానే తన నియోజకవర్గంలోని ఓ ఈద్గా గ్రౌండ్ వద్ద సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారని నేను నా రెగ్యులర్ స్టైల్ లో వెళ్లి పగలగొట్టానని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదే స్థలానికి పక్కన ఉన్న మరికొంత స్థలంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కోసం ల్యాండ్ ఇవ్వమంటే అధికారులు ఇవ్వలేకపోయారు. కానీ ఆ పక్కనే ఉన్న ఈద్గా గ్రౌండ్ లో లోకల్ ఎమ్మెల్యేను నా దృష్టికి తేకుండానే సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారన్నారు. అందుకే నాకు వేరే ఆప్షన్ లేక దాన్ని పగలగొట్టానన్నారు. అలాగే మిడ్ డే మీల్స్ లో విద్యార్థులకు ఎగ్స్ ఇవ్వడం లేదని ఆ పిల్లలకు మనం ఎగ్స్ ఇవ్వాలి కదా అన్నారు. నా నియోజకవర్గం పరిధిలోని అంశాలపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని నోట్ చేసుకుంటామని చెప్పడం కాదన్నారు. నాకు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. నాకు తెలుసు ఏం మాట్లాడాలో.. అందరికంటే సీనియర్ ఎమ్మెల్యేను నేను అంటూ కామెంట్స్ చేశారు. నూతన భవనాల నిర్మాణాల విషయంలో సోషల్ మీడియాలో చిన్నచిన్న పత్రికలతో బ్లాక్ మెయిల్ లో చేస్తున్నారు. వీరికి జీహెచ్ఎంసీ అధికారులు వణికిపోతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఫోన్ చేసినా స్పందించరు కానీ సోషల్ మీడియా పర్సన్స్ ఫోన్ చేస్తే మాత్రం భయపడుతున్నారని అన్నారు. ఆ తర్వాత అధికారులు వారు కలిసి లావాదేవీలు చేసుకుంటున్నారని ఆరోపించారు. వీటిపై యాక్షన్ తీసుకోవాలని కోరారు.

## పైలాన్ కట్టిన పట్టణంలోనే నీళ్లు లేవు

**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**

తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల్లో ఐదో రోజు ఉదయం కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన నియోజకవర్గంలో నెలకొన్న నీటి సమస్యలను లేవనెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక ఫ్లోరైడ్ ఉన్న ప్రాంతంగా మునుగోడు నియోజకవర్గం ఉందని, ఎంతో ప్రతిష్టాత్మకంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటింటికి నల్లా అని చెప్పి మిషన్ భగీరథ కు 50 వేల కోట్ల రూపాయలు అప్పు తీసుకొచ్చిందని.. ఇందులో పైలాన్ కట్టిన చౌటుప్పల్ పట్టణం లోనే నీళ్లు లేవని చెప్పుకొచ్చారు. మిషన్ భగీరథ కోసం వేలకోట్ల రూపాయల అప్పులు చేసి నిర్మించిన ప్రాజెక్టు వల్ల కాంట్రాక్టర్లు బాగుపడ్డారు కానీ దాని ఫలితాలు ప్రజలకు సరిగ్గా అందలేదని చెప్పుకొచ్చారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరిగిపోతుండటం వల్ల నారాయణపూర్ చౌటుప్పల్ మండలాలలో భూగర్భ జలాలు పడిపోయి పంటలు ఎండిపోతున్నాయని చెప్పుకొచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం చౌటుప్పల్ పట్టణానికి తాగునీటి కేటాయింపులు జరిగాయని, అక్కడ ఉన్న పరిశ్రమల వల్ల జనాభా పెరిగిందని, ఇప్పటి జనాభా ప్రాతిపదికన నీటి కేటాయింపులు లేకపోవడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే పరిష్కరించాలని కోరారు.

## మా జన్మ ధన్యమైందని భవిస్తున్నా..

**విప్ ఆది శ్రీనివాస్**

తెలంగాణ కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్ గా నిలిచిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తూతుమంత్రంగా చేపట్టిన సర్వేలా కాకుండా పక్కగా లెక్కలతో పకడ్బందీగా సర్వే నిర్వహించామని పేర్కొన్నారు. తెలంగాణ సమగ్ర సర్వేను చూసి దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున డిమాండ్లు వస్తున్నాయని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో తమ అధినేత రాహుల్ గాంధీ కూడా దేశ వ్యాప్తంగా కులగణన జరపాలని డిమాండ్ చేశారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్‌గా ప్రభుత్వం బీసీ డెడికేటెడ్ కమిటీ వేసి ఎక్కడా భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా సర్వే కొనసాగిందని అన్నారు. కులగణలో 56.36 శాతం బలహీనవర్గాలు ఉన్నట్లుగా తేలిందని అన్నారు. బీసీ లకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన బిల్లు ఆమోదం పొందడంతో తమ జీవతం ధన్యమైనట్లుగా భావిస్తున్నామని అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలుసుకున్న

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పకడ్బందీగా కుల గణన పూర్తి చేసీ బీసీ జనాభా లెక్క పక్కాగా తేల్చి విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆ కోటాకు చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర శాసన సభలో బిల్లును ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, బీసీ ఎమ్మెల్యేలు బీసీ సంఘాల నాయకులు బీసీ ప్రముఖులు, మేధావులు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, వి హనుమంత రావు తదితర బిసి నాయకులు, ప్రజా ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చం ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని తెలంగాణ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర చిరకాలం నిలిచి ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ కొనియాడారు..

# కీరదోస జ్యూస్‌తో శరీరంలో జరిగే మార్పులు..




హార్ట్ ఎటాక్‌లు కూడా మన దరిచేరవు. కీరదోసలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలను కూడా తగ్గిస్తుంది. అంతేకాకుండా అజీర్ణం,గ్యాస్, మలబద్ధకాన్ని పోగొడుతుంది. అదేవిధంగా కీరలోని విటమిన్ సి మన ఇమ్యూనిటీని కూడా బాగా పెంచుతుంది. వ్యాధులు మన దరి చేరకుండా ఉంటాయి. శరీరానికి ఎంతో రిలాక్సేషన్ ఇస్తుంది. దీంతో నిద్రలేమి సమస్యల నుంచి బయటపడొచ్చు. ఇందులోని పొటాషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. కీరదోస ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనితో ఎక్కువ సేపు ఆకలి కాకుండా ఉంటుంది.
కీరదోసలోని పుష్కలమైన పోషకాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండటంతో రక్తపోటుతో బాధపడేవారికి ఇది చక్కని ఆహారం. రోజూ కప్పు కీరదోస రసం తాగితే మేని నిగారింపు సంతరించుకుంటుంది. కీరదోసలో విటమిన్- ఎ, సిలు పుష్కలంగా లభిస్తాయి. కీరదోస జ్యూస్ మంచి డిటాక్స్ డ్రింక్‌లా కూడా పనిచేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజు ఉదయం పరగడుపునే ఈ జ్యూస్ తాగితే శరీరంలోని వ్యర్థాలన్నీ సులభంగా బయటికి పోతాయి. శరీరం శుభ్రంగా మారుతుంది. అనేక వ్యాధుల నుంచి మనకు రక్షణగా ఉంటుంది. కీరదోస జ్యూస్ ప్రతిరోజు తాగడం వల్ల శరీరంలో ఉండే అధిక కొవ్వు కరుగుతుంది. బరువు కూడా తొందరగా తగ్గుతారు. పొట్ట భాగంలో ఉన్న కొవ్వు కూడా ఇట్టే కరిగిపోతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఊబకాయులకు కీరదోస జ్యూస్ చాలా ఉపయోగకరం. కాబట్టి ప్రతిరోజు దీన్ని తీసుకుంటే మంచిది. అంతేకాకుండా వేసవి తాపాన్ని తగ్గిస్తుంది. వడదెబ్బ బారిన పడకుండా కాపాడుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. కీరదోసలో విటమిన్ కె అధికంగా ఉండటం వల్ల గాయాలు అయిన వెంటనే రక్తస్రావం కాకుండా రక్తం త్వరగా గడ్డకట్టేలా చేస్తుంది. కీరదోసలోని మెగ్నీషియం నిద్రబాగా పట్టేలా చేస్తుంది. శరీరానికి ఎంతో రిలాక్సేషన్ ఇస్తుంది. దీంతో నిద్రలేమి సమస్యల నుంచి బయటపడొచ్చు. ఇందులోని పొటాషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. మన శరీరంలోని చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా అదుపులో ఉంచుతుంది. దీని వల్ల మన గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్‌లు కూడా మన దరిచేరవు. కీరదోసలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలను కూడా తగ్గిస్తుంది. అంతేకాకుండా అజీర్ణం,గ్యాస్, మలబద్ధకాన్ని పోగొడుతుంది. అదేవిధంగా కీరలోని విటమిన్ సి మన ఇమ్యూనిటీని కూడా బాగా పెంచుతుంది. వ్యాధులు మన దరి చేరకుండా ఉంటాయి.

# ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వాడుతున్నారా..?

ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వాడకంపై అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. దీని వాడకంతో పోషకాలు తగ్గిపోవడం, డయాబెటిస్, క్యాన్సర్ వంటి ప్రమాదాలు పెరగవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. కాబట్టి ఆరోగ్యకరమైన మార్గాలైన ప్రెషర్ కుక్కర్, మట్టి పాత్రల్లో బియ్యం వండటం ఉత్తమం. ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వాడకం చాలా మందికి సులభతరం అయింది. ముఖ్యంగా వంట గురించి పెద్దగా తెలియని వారు దీన్ని ఉపయోగించడం ద్వారా తేలికగా అన్నం వండుకోగలరు. తక్కువ సమయంలో బియ్యం సిద్ధం చేయాలనుకునే వారికి ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ ఒక సరైన ఎంపికగా భావించవచ్చు. కానీ దీని వాడకంపై అనేక సందేహాలు, అపోహలు ప్రజల్లో ఉన్నాయి. ముఖ్యంగా ఆరోగ్య నిపుణులు ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వాడకంపై ఏం చెబుతున్నారో తెలుసా..? వారు చెబుతున్న దాని ప్రకారం ఈ కుక్కర్‌లో వండిన బియ్యం తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయనే ఉద్దేశ్యం ఉంది. డయాబెటిస్ ప్రమాదం పెరగడం, శరీరానికి అవసరమైన పోషకాలు తగ్గిపోవడం వంటివి. ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌లో వండిన బియ్యం తినడం శరీరానికి సరైన పోషణ అందించకపోవడంతోపాటు రోగ నిరోధక శక్తిని తగ్గించే అవకాశాలు ఉన్నాయి. రైస్ కుక్కర్‌లో బియ్యం వండేటప్పుడు కొన్ని ప్రమాదకరమైన రసాయనాలు విడుదల అవుతాయట. రైస్ కుక్కర్ తయారీలో వాడిన అల్యూమినియం పాత్రలు వంటకు పూర్తిగా సురక్షితం కాదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ రసాయనాలతో కలసిన ఆహారం తినడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు రావడమే కాకుండా కాలక్రమంలో ఆరోగ్యానికి మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వాడకంపై మరొక ముఖ్యమైన ఆందోళన క్యాన్సర్ ప్రమాదం. ఈ కుక్కర్‌లో వండిన ఆహారాన్ని తరచుగా తీసుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. రైస్ కుక్కర్ వాడకం వల్ల రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బియ్యం రుచికరమైనదిగా అనిపించినప్పటికీ దీని ఆరోగ్యపరమైన ప్రభావాలు గణనీయంగా ఉంటాయి. ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వాడకంపై ఉన్న ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైస్ కుక్కర్‌కు బదులుగా ప్రెషర్ కుక్కర్ లేదా మట్టి పాత్రలను వాడటం ఆరోగ్యకరమైన మార్గం. ప్రెషర్ కుక్కర్‌లో వండిన బియ్యం త్వరగా సిద్ధం కావడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది. అదే విధంగా మట్టి పాత్రలో బియ్యం వండితే అది రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనుకూలంగా ఉంటుంది. తక్కువ నాణ్యత గల ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌లను వాడితే మరింత హానికరమైన పరిస్థితులు ఏర్పడవచ్చు. దీన్ని తరచుగా వాడటం గుండెకు హానికరం కావచ్చని కూడా నిపుణులు చెబుతున్నారు. అందువల్ల వీలైనంత వరకు ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వాడకాన్ని తగ్గించడం మంచిదంటున్నారు. బియ్యం వండడానికి ఆరోగ్యకరమైన మార్గాలు ఉపయోగించడం, ముఖ్యంగా ప్రెషర్ కుక్కర్ లేదా మట్టి పాత్రలను వాడటం ఉత్తమం.





# చియా సీడ్స్ వాటర్ తాగుతున్నారా?

ఇది మీ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. చియా సీడ్స్ తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ సంగ్రహణ మందగిస్తుంది. దాంతో బ్లడ్ షుగర్ ఒకేసారి పెరగడం ఉండదు. ఇన్సులిన్ రెసిస్టెన్స్‌లో కీలకంగా ఉపయోగపడుతుంది. డయాబెటిస్ నియంత్రిస్తుంది. చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు, ఫైబర్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. నీళ్లలో చియా సీడ్స్ నానబెట్టడం వల్ల జెల్‌లా ఏర్పడుతుంది. ఇది మీ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. చియా సీడ్స్ తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ సంగ్రహణ మందగిస్తుంది. దాంతో బ్లడ్ షుగర్ ఒకేసారి పెరగడం ఉండదు. ఇన్సులిన్ రెసిస్టెన్స్‌లో కీలకంగా ఉపయోగపడుతుంది. డయాబెటిస్ నియంత్రిస్తుంది. చియా గింజలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకోండి. చియా సీడ్స్‌లో ఫైబర్, ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల ఎక్కువ సేపు ఆకలేయదు. అర్ధరాత్రి ఆకలిని నియంత్రిస్తుంది. అతిగా తినడాన్ని ఆపుతుంది. ఫలితంగా బరువు నియంత్రణకు దోహదం చేస్తుంది. చియా సీడ్స్‌లో ఫైబర్ అత్యధికంగా ఉంటుంది. దాంతో గట్ హెల్త్ మెరుగుపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపర్చి మలబద్ధకం సమస్య లేకుండా చేస్తుంది. చియా సీడ్స్‌లో ఉండే ట్రిప్టోఫాన్ అనే ఎమైనో ఆసిడ్ సెరిటోనిన్, మెలానిన్ ఉత్పత్తికి దోహదం చేస్తుంది. ఫలితంగా మంచి నిద్ర పడుతుంది. చియా విత్తనాలు చిన్నవిగా ఉండవచ్చు, కానీ అవి పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యం నుండి ఎముకలను బలోపేతం చేయడం, రక్తంలో చక్కెర నిర్వహణ వరకు ప్రతిదానినీ మెరుగుపరుస్తాయి. చియా గింజలు ఖనిజాలకు గొప్ప మూలం. ఇవి ఎముకల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. ఇందులో కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం ఉంటాయి. 25 గ్రాముల చియా విత్తనాలలో దాదాపు 158 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటుంది, ఇది ఒక గ్లాసు పాలలో ఉన్నంత. చియా విత్తనాలలో పాలీ-అన్‌శాచురేటెడ్ కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇది కాకుండా, ఇందులో చాలా ఫైబర్ ఉంటుంది. యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల దీన్ని తినడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. చియా గింజలు, చియా పిండి కూడా అధిక రక్తపోటు ఉన్నవారిలో రక్తపోటును తగ్గిస్తాయి.

# వేడి నీరు ఆరోగ్యానికి మంచిదే!

వేడి నీరు తాగడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలను అందిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచి, బరువు తగ్గడంలో సహాయపడుతుంది. శరీరంలో విషపదార్థాలను తొలగించేందుకు వేడి నీరు ఎంతో మేలు చేస్తుంది. శ్వాసకోశ సమస్యలు తగ్గించి, రక్తప్రసరణ మెరుగుపరచడంలో ఇది ఉపయోగపడుతుంది. కానీ ఎక్కువ వేడి నీరు తాగడం కొన్ని సమస్యలు కలిగించవచ్చు. వేడి నీరు తాగడం ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలిగిస్తుంది. ఇది శరీరాన్ని శుభ్రపరచడంలో, జీవక్రియను వేగవంతం చేయడంలో, ఇతర ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. వేడి నీరు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. చల్లని నీరు వల్ల కడుపులో కొంచెం గడబిడ్లు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. కానీ వేడి నీరు ఆ సమస్యలను తగ్గిస్తుంది. దీని వల్ల శరీరానికి పోషకాలు త్వరగా అందుతాయి. ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పరిశోధనల ప్రకారం వేడి నీరు జీవక్రియను వేగవంతం చేస్తుంది. అది శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. కొంతమంది నిపుణుల మాటల ప్రకారం వేడి నీరు తాగితే ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయట. దీంతో బరువు తగ్గడానికి సహాయపడుతుంది. వేడి నీరు శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో కూడా సహాయపడుతుంది. వేడి నీరు తాగడం వల్ల రక్తనాళాలు విస్తరించి, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీని వలన శరీర కండరాలు సడలిపోయి, శరీరంలో తగినంత రక్త ప్రసరణ ఉంటుంది. కండరాల నొప్పులు తగ్గడానికి వేడి నీరు మంచిదని అంటారు. వేడి నీరు తాగడం వల్ల శ్వాస సంబంధ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులలో సర్ది లేదా శ్లేష్మం ఉన్నప్పుడు వేడి నీరు తాగడం వల్ల అది త్వరగా బయటకు వస్తుంది. ఇది శ్వాసనాళాలను శుభ్రపరచడంలో కూడా సహాయపడుతుంది. వేడి నీరు తాగడం వల్ల శరీరం నుండి మలినాలు, విషపదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. గోరువెచ్చని నీరు మంచి డీటాక్సిఫైయర్ గా పనిచేస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. వేసవిలో వేడి నీరు తాగడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. చెమట వల్ల శరీరంలోని మలినాలు బయటకు వస్తాయి. ఇది చర్మాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. అలాగే వేడి నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇది కొంతవరకు శరీరాన్ని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. అయితే వేడి నీరు ఎక్కువగా తాగితే కొందరికి కొన్ని సమస్యలు రావచ్చు. చాలా వేడి నీరు తాగడం వల్ల కడుపులో మంట, అజీర్ణం, అల్సర్లు వంటి సమస్యలు కలగవచ్చు. అందుకే గోరువెచ్చని నీటిని తాగడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



## బిజినెస్

# టాటా నుంచి మరో అద్భుతమైన ఎలక్ట్రిక్ కారు

ఇప్పుడు టాటా మోటార్స్ కంపెనీ నుంచి మరో ఎలక్ట్రిక్ కారు మార్కెట్ లోకి విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. కాగా టాటా కంపెనీ రాబోయే హారియర్ ఈవీ ప్రొడక్షన్ రెడీ వెర్షన్ ను ప్రవేశపెట్టింది. ఈ కారు త్వరలో ఇండియాలో అందుబాటులోకి రావచ్చుట. ఇంతకుముందు ఈ కారు జనవరి 2025లో జరిగిన ఇండియా మొబిలిటీ ఎక్స్‌పోలో ప్రదర్శించింది టాటా కంపెనీ. అయితే అప్పుడు ఇది కేవలం ఎగ్జిబిషన్ మోడల్ మాత్రమే. కానీ ఇప్పుడు టాటా ఈ కారును టెస్ట్ ట్రాక్ లో నడపడం ద్వారా దాని సామర్థ్యాలను ప్రదర్శించిందట. కాగా ఈ హరియర్ ఈవీ కారు అద్భుతమైన డిజైన్ తో రానుంది. దాని లుక్ పెట్రోల్ వెర్షన్ ని పోలి ఉంటుందట. అయితే దీనిలో కొన్ని ప్రత్యేక మార్పులు చేసిందట. అదేమిటంటే ఇది పెట్రోల్ వెర్షన్ నుండి భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. కాగా కారు డిజైన్ ను మరింత మెరుగుపరచడం కోసం దీనిలో కొత్త స్టైల్ అల్లాయ్ వీల్స్ ను ఏర్పాటు చేశారట. కారు వెనుక భాగం మునుపటిలాగే కనిపిస్తుందట. కానీ దీనికి కనెక్ట్ చేయబడిన ాజుణ టెయిల్ లైట్లు ఉంటాయట. అలాగే ఇది కొద్దిగా భిన్నంగా ఉంటుందని, అలాగే వెనుక బంపర్ కూడా పునః రూపకల్పన చేయబడిందని చెబుతున్నారు. ఇప్పుడు ముందు బంపర్ లాగా నిలువు స్లాట్ లకు సరిపోతుందట. లోపలి భాగంలో టాటా హారియర్ ఈవీ లేఅవుట్ పెట్రోల్ వెర్షన్ ని పోలి ఉంటుందట. క్యాబిన్ ముఖ్యాంశాలు వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లేకు మద్దతు ఇచ్చే 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ తో ఉందట. ఇందులో 10.25 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 10 స్పీకర్ జేబీఎల్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయట. అలాగే భద్రత కోసం దీనికి ఏడు ఎయిర్ బ్యాగులు, జుదీణతో కూడిన ాాదీూ, వెనుక పార్కింగ్ సెన్సార్లు, 360 డిగ్రీ కెమెరా, ఆటో హోల్డ్ తో కూడిన ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ూాఁమీా, ాాణూాూ వంటి ఫీచర్లను అందించింది టాటా కంపెనీ.




## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో నకిలీ ఉత్పత్తులు




ఇ-కామర్స్ సంస్థల్లో నకిలీ ఉత్పత్తులు, ప్రామాణికత లేని ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఎట్టకేలకు దృష్టి పెట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ ఆన్‌లైన్ విక్రేతలకు చెందిన గిడ్డంగులపై బీఐఎస్ దాడులు చేసి వేలాది ధృవీకరించని ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 7న లక్నో, గురుగావ్, ఢిల్లీలోని ఇ-కామర్స్ గిడ్డంగులపై బీఐఎస్ దాడులు నిర్వహించింది. లక్నోలోని అమెజాన్ గిడ్డంగి నుండి 215 బొమ్మలు, 24 హ్యాండ్ బ్లెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బీఐఎస్ సర్టిఫికేషన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఫిబ్రవరి 2025లో గురుగావ్‌లోని అమెజాన్ గిడ్డంగిపై జరిగిన దాడిలో 58 అల్యూమినియం ఫాయిల్స్, 34 మెటాలిక్ వాటర్ బాటిళ్లు, 25 బొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పివిసి కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్ గురుగావ్ గిడ్డంగిలో జరిపిన సోదాల్లో సర్టిఫికెట్లు లేని 534 స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు, 134 బొమ్మలు, 41 స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. బీఐఎస్ గుర్తింపు లేని ఉత్పత్తులను ఆయా సంస్థల్లో నిరంతరం విక్రయించడంపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో సోదాలు చేసినట్టు సమాచారం.

## బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు



ఈక్విటీ మార్కెట్ ఐదు రోజుల నష్టాలకు తెర దించింది. ప్రపంచ మార్కెట్లలో ఏర్పడిన ర్యాలీకి తోడు బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌ను లాభాల్లో నిలిపింది. ఇంట్రాడేలో 547.44 పాయింట్లు లాభపడి 74,376.35ని తాకిన సెన్సెక్స్ చివరికి 341.04 పాయింట్ల లాభంతో 74,169.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 111.55 పాయింట్ల లాభంతో 22,508.75 వద్ద క్లోజయింది. మార్కెట్లో కన్సాలిడేషన్ కొనసాగుతున్నదని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ పరిశోధనా విభాగం వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 24 పైసలు పుంజుకుని 86.81 వద్ద ముగిసింది. ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీసపై దివాలా చర్యలు ప్రారంభించాలంటూ కంపెనీకి ఆపరేషనల్ క్రెడిటర్ అయిన రోజ్‌మెర్టా డిజిటల్ సర్వీసెస్ కంపెనీ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేర్లు 7 శాతం మేరకు నష్టపోయాయి. ఈ షేరు బీఎసఈలో 7.18న నష్టంతో రూ.46.91 వద్ద ముగియగా ఎన్ఎసఈలో 7.22న నష్టంతో రూ.46.86 వద్ద ముగిసింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రరూ.1601.13 కోట్ల మేరకు తగ్గి రూ.20,691.20 కోట్ల వద్ద స్థిరపడింది.

## మళ్లీ మారుతీ సుజుకీ ధరల పెంపు




దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మరోమారు తమ వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి తమ వాహన ధరలను 4 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్లు ఆ కంపెనీ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో గత రెండు నెలల్లో ఇది రెండోసారి పెంపు కావడం గమనార్హం. తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ వ్యయాల భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయడం మినహా వేరే మార్గం లేదని ఆ కంపెనీ పేర్కొంది. ఈ కంపెనీ ప్రాథమిక మోడల్ అల్టో కె-10 నుంచి ఇన్విక్టో మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరల శ్రేణీ రూ.4 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు ఉంది. ఇంతక్రితం మోడళ్లను బట్టి గరిష్ఠంగా రూ.32,500 వరకు పెంచేసింది. తాజా పెంపునతో కొనుగోలుదారులపై మరింత భారం పడనుంది.

## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో నకిలీ ఉత్పత్తులు





ఇ-కామర్స్ సంస్థల్లో నకిలీ ఉత్పత్తులు, ప్రామాణికత లేని ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఎట్టకేలకు దృష్టి పెట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ ఆన్‌లైన్ విక్రేతలకు చెందిన గిడ్డంగులపై బిఐఎస్ దాడులు చేసి వేలాది ధృవీకరించని ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 7న లక్నో, గురుగావ్, ఢిల్లీలోని ఇ-కామర్స్ గిడ్డంగులపై బిఐఎస్ దాడులు నిర్వహించింది. లక్నోలోని అమెజాన్ గిడ్డంగి నుండి 215 బొమ్మలు, 24 హ్యాండ్ బ్లెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బిఐఎస్ సర్టిఫికేషన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఫిబ్రవరి 2025లో గురుగావ్‌లోని అమెజాన్ గిడ్డంగిపై జరిగిన దాడిలో 58 అల్యూమినియం ఫాయిల్స్, 34 మెటాలిక్ వాటర్ బాటిళ్లు, 25 బొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పివిసి కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్ గురుగావ్ గిడ్డంగిలో జరిపిన సోదాల్లో సర్టిఫికెట్లు లేని 534 స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు, 134 బొమ్మలు, 41 స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. బిఐఎస్ గుర్తింపు లేని ఉత్పత్తులను ఆయా సంస్థల్లో నిరంతరం విక్రయించడంపై ఫిర్యాదులు అందిస్తోన్న నేపథ్యంలో సోదాలు చేసినట్లు సమాచారం.

## స్పోర్ట్స్

# భారీ ఆశలతో సన్‌రైజర్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్ 18కు త్వరలో తెరలేవనున్న సంగతి తెలిసిందే. మార్చి 22 నుంచి మే 25 వరకు జరిగే ఈ మెగా టోర్నమెంట్‌లో పది జట్లు బరిలో దిగుతున్నాయి. కిందటి సీజన్‌లో రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి ఎలాగైనా ట్రోఫీని గెలుచుకోవాలనే పట్టుదలతో ఉంది. ఆస్ట్రేలియా సీనియర్ ఆటగాడు పాట్ కమిన్స్ కెప్టెన్సీలో హైదరాబాద్ తనఅదృష్టాన్ని పరీక్షించుకోనుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సన్‌రైజర్స్ సమతూకంగా ఉంది. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు.కిందటి సీజన్‌లో పరుగుల సునామీ సృష్టించిన అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డిలపై ఈసారి కూడా జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఓపెనర్లు అభిషేక్, ట్రావిస్ హెడ్‌లు కిందటి సారి విధ్వంసక బ్యాటింగ్‌తో పెను ప్రకంపనలు సృష్టించారు. అసాధారణ బ్యాటింగ్‌తో ఎన్నో రికార్డులను తిరగరాశారు. ఈసారి కూడా వీరిపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. వీరికి తోడుగా ఇషాన్ కిషన్ వంటి మరో విధ్వంసక బ్యాటర్ జట్టుకు అందుబాటులోకి వచ్చాడు. మెగా వేలం పాటలో భారీ మొత్తం ధరకు ఇషాన్‌ను సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. ట్రావిస్, అభిషేక్, క్లాసెన్, ఇషాన్, నితీశ్ రెడ్డిలతో హైదరాబాద్ బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. అంతేగాక పాట్ కమిన్స్ నేతృత్వంలోని బౌలింగ్ కూడా బాగానే ఉంది. రెండు విభాగాల్లో సమతూకంగా ఉన్న సన్‌రైజర్స్ ట్రోఫీపై కన్నేసింది. కమిన్స్ నాయకత్వం ప్రతిభకు యువ ఆటగాళ్ల సహకారం తోడైతే హైదరాబాద్ ఐపిఎల్ ట్రోఫీని సాధించడం ఖాయం. హైదరాబాద్ ఆటగాళ్లు ఇప్పటికే సాధన ప్రారంభించారు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ తదితరులు నెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆటగాళ్లు సాధనలో నిమగ్నమయ్యారు. జట్టు సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయి ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతున్నారు. ప్రధానకోచ్ డానియల్ వెటోరి పర్యవేక్షణలో ఆటగాళ్లు సాధన చేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మెరుగ్గా ఉన్న హైదరాబాద్‌ను ఐపిఎల్ ఫేవరెట్‌లలో ఒకటిగా పరిగణిస్తున్నారు. విధ్వంసక బ్యాటర్లు కలిగిన సన్‌రైజర్స్ ఈ సీజన్‌లో పెను ప్రకంపనలు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు జోస్యం చెబుతున్నారు.





## నష్టాలు మిగిల్చిన ఛాంపియన్స్ ట్రోఫీ



ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఓ ఐసిసి ఈవెంట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం పాకిస్థాన్‌కు దక్కింది. ఈ ఏడాది జరిగిన ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీకి హోస్ట్‌గా వ్యవహరించిన పాక్.. అన్ని చేదు అనుభవాలే మూటగట్టుకుంది. ఈ సిరీస్‌లో గ్రూప్ స్టేజ్ నుంచే వైదొలగడం.. భారత్ ఛాంపియన్ కావడం.. ట్రోఫీ ప్రధానోత్సవంలో పాక్ ప్రతినిధులను పిలవకపోవడం వంటి మింగుడుపడని ఘటనలు ఎన్నో జరిగాయి. అయితే తాజాగా పాకిస్థాన్ ఓ తేరుకోలేని సమస్యలో ఇరుక్కుపోయింది. ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన పాక్‌కు ఈ టోర్నమెంట్ భారీ ఆర్థిక నష్టాలను అందించింది. ఈ టోర్నమెంట్ కోసం పాకిస్థాన్ 18 బిలియన్ పాకిస్థాన్ రూపాయిలు(58 మిలియన్ డాలర్లు) ఖర్చు చేసిందట. రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియంల ఆధునికీకరణకు ఈ డబ్బులు వెచ్చిందని స్థానిక మీడియా పేర్కొంది. అంతేకాక.. ఈవెంట్ సన్నహాల కోసం మరో 40 మిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. దీంతో కానీ, హోస్టింగ్ ఫీజు కింద పాక్ అందుకుంది కేవలం 6 మిలియన్ డాలర్లు మాత్రమే. ఇక టికెట్ అమ్మకాలు, స్పాన్సర్స్ ద్వారా వచ్చిన డబ్బులు చాలా తక్కువే. దీంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఈ టోర్నమెంట్ అక్షరాల 85 మిలియన్ డాలర్ల నష్టం మిగిల్చింది. ఇప్పుడు దీన్ని భర్తీ చేసేందుకు పాక్ బోర్డు ఆటగాళ్లు షాక్ ఇవ్వాలని ఆలోచిస్తుందట. వారి వేతనాల నుంచి భారీగా కోతలు విధించాలనే ప్లాన్‌లో ఉన్నట్లు సమాచారం. అంతేకాక.. ఆటగాళ్లు 5స్టార్ హోటల్ వసతులను తగ్గించి.. ఎకానమీ హోటల్‌లో సర్దుకోవాలని బోర్డు సూచించనున్నట్లు సమాచారం.

# బిసిసిఐ నిర్ణయం సరైందే




ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) 2025 సీజన్ నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ హారీ బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం విధించింది. అతనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) తీసుకున్న నిర్ణయాన్ని ఇంగ్లండ్ స్టార్ స్పిన్నర్లు మొయిన్ అలీ, ఆదిల్ రషీద్ సమర్థించారు. రెండేళ్ల పాటు బ్రూక్‌పై నిషేధం విధించడం తప్పేమీ కాదని, ఆటగాళ్లు అకస్మాత్తుగా 'తప్పుకోవాలనే' నిర్ణయం తీసుకోవడం వల్ల జట్టు కూర్పు దెబ్బతింటుందని మొయిన్ తెలిపాడు. గాయం వల్ల సీజన్ నుంచి తప్పుకొంటే ఎవరూ తప్పుబట్టరు. బోర్డు కూడా ఇందుకు మినహాయింపు ఇస్తుంది. కానీ వేరే కారణాలు చూపుతూ అర్ధంతరంగా తప్పుకోవడం ఏమాత్రం సరికాదరి బ్రూక్ తీరును మొయిన్ అలీ తప్పుబట్టాడు. ఇదేవిధంగా రషీద్ కూడా బిసిసిఐ నిర్ణయాన్ని సమర్థించాడు. ఇదిలా ఉంటే.. ఐపిఎల్-2025 మెగా వేలంలో బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.6.25కోట్లకు కొనుగోలు చేసింది. మరోవైపు మొయిన్ అలీని కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎంపికైన బ్రూక్.. మార్చి 22 నుంచి జరిగే ఐపిఎల్ 18వ సీజన్‌లో పాల్గొనాల్సి ఉంది. సవరించిన ఐపిఎల్ నిబంధనల ప్రకారం.. ఎవరైనా ఆటగాడు వేలంలో తన పేరు నమోదు చేసుకొని అమ్ముడైన తర్వాత సీజన్‌కు అందుబాటులో ఉండాల్సిందే. గాయం తప్ప ఇతరత్రా కారణాలను సాకులుగా చెబితే కుదరదు. ఇలా సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకొన్న ఆటగాళ్లను రెండు సీజన్ల పాటు లీగ్‌లో పాల్గొనకుండా నిషేధం విధిస్తారు. ఈ మేరకు ఐపీఎల్ నియమావళిలో నిబంధనలు పొందుపరిచారు. తాజా నిబంధన ప్రకారమే హ్యారీ బ్రూక్‌పై చర్యలు తీసుకున్నట్లు బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో 2025, 2026 సీజన్లలో బ్రూక్ పాల్గొనేందుకు వీలుండదు. ఈ మేరకు సదరు క్రికెటర్‌తో పాటు, ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి)కు సమాచారం ఇచ్చారు. నిజానికి బ్రూక్ ఇలా చేయడం ఇదేం మొదటిసారి కాదు.

## దిల్ రుబా దెబ్బకు 'కె ర్యాంప్' చెకింగ్



ఇటీవలే విడుదలైన దిల్ రుబా కిరణ్ అబ్బవరంకు పెద్ద షాకే ఇచ్చింది. ముందు రోజు సాయంత్రం ప్రీమియర్ షో నుంచే నెగటివ్ టాక్ బయటికి వచ్చేయడంతో వాస్తవాన్ని అర్థం చేసుకున్న టీమ్ ఆ తర్వాత అనవసర ఆర్భాటాలు, బాణాసంచా కాల్చడాలు లాంటివి చేయకుండా సైలెంట్ అయిపోయింది. కనీసం పది కోట్లయినా వసూలు చేస్తుందనుకుంటే అందులో సగం కూడా తేలేని పరిస్థితి ఉండటంతో దాని ప్రభావం మార్కెట్ మీద ఎంత ఉంటుందనే దాని గురించి తర్వాతి నిర్మాతలు ఆందోళన చెందడం సహజం. నెక్స్ట్ నిర్మాణంలో ఉన్నది కె ర్యాంప్. ఇటీవలే అఫీషియల్ గా ప్రకటించారు. కేరళ కాలేజీ బ్యాక్ డ్రాప్ లో మంచి యూత్ ఫుల్ కంటెంట్ తో క్రేజీ రొమాన్స్ కూడా దట్టించారని దీని గురించి ఇన్ సైడ్ టాక్ ఉంది. రెగ్యులర్ షూటింగ్ ఇంకా వెళ్ళలేదు కానీ డిస్కషన్స్ లో ఉన్నవాళ్లు చెప్పిన దాని ప్రకారం ఓ రేంజ్ హాస్యం రాసుకున్నారట. లిప్ లాక్ కిస్సులు వగైరాలు కూడా ఉన్నాయట. అయితే దిల్ రుబా ఫలితం చూసిన కె ర్యాంప్ మరోసారి స్క్రిప్ట్ ని వడబోసి ఏమైనా పొరపాట్లు ఉన్నాయేమో సరిచూసుకునే పనిలో పడ్డట్టు సమాచారం. ఎంత యూత్ ని టార్గెట్ చేసుకున్నా వాళ్లకు నచ్చే విధంగా నెరేషన్ లేకపోతే ఏమవుతుందో దిల్ రుబా నిరూపించేసింది కాబట్టే ఈ జాగ్రత్త అవసరం.

## ఓటీటీలోకి లేటెస్ట్ సూపర్ హిట్ సినిమా..

లవ్ టుడే ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ నటించిన తాజా చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. అశ్వత్ మారిముత్తు తెరకెక్కించిన ఈ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లో . అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్ హీరోయిన్లుగా నటించారు. ఫిబ్రవరి 21న తమిళంతో పాటు తెలుగులోనూ ఒకే సారి థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ముఖ్యంగా యూత్ ను ఈ మూవీ బాగా ఆకట్టుకుంది. ప్రదీప్ రంగనాథన్ తన యాక్టింగ్ తో మరోసారి అదరగొట్టాడు. అనుపమా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తన స్క్రీన్ ప్రజెన్స్ తో మరోసారి ఆడియెన్స్ ను ఆకట్టుకుంది. ఇక ఈ సినిమాతో కుర్రకారు కొత్త క్రష్ గా మారిపోయింది కయాదు లోహర్. డైరెక్టర్ శంకర్, బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ లాంటి ప్రముఖులు సైతం రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ మూవీపై ప్రశంసలు కురిపించారు.





## బోల్డ్ హీరోయిన్‌గా సూపర్ క్రేజ్

ఈ క్యూటీ ఒకప్పుడు టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్. ఇప్పుడు కూడా సినిమాల్లో నటిస్తుందనుకోండి.. కానీ.. ఆ క్రేజ్ లేదు. అందం, ట్యాలెంట్ ఉన్న ఈ అమ్మడు ఒకప్పుడు బాగా సెన్సేషన్ అయ్యింది. కానీ రాను రాను సినిమా అవకాశాలు తగ్గిపోయాయి. ఒకప్పుడు తన సినిమాలతో అరకోటికి పైగా సంపాదించిన ఈ అందాల తార ఇప్పుడు కేవలం టాక్ షోలకే పరిమితమైంది. అప్పట్లో బోల్డ్ పాత్రలతో అలరించిన ఈ అందాల తార ఇప్పుడు బోల్డ్ కామెంట్స్ తో తరచూ వార్తల్లో నిలుస్తోంది. తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ లోనూ సందడి చేసిన ఈ ముద్దుగుమ్మ మరెవరో కాదు తేజస్వి మదివాడ. ఇది ఆమె చిన్ననాటి ఫొటో. సినిమాల్లో ఎప్పుడు అల్లరిగా, చలాకీగా కనిపించే ఈ అందాల తార జీవితంలో ఎన్నో కష్టాలున్నాయి. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి మందుకు బానిసయ్యాడు. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చి అనాథాశ్రమంలో పెరిగింది. ఎన్నో ఇబ్బందులు పడి చదువు కొనసాగింది. రెండేళ్లపాటు లంచ్ టైంలో పానీపూరి తిని కడుపు నింపుకున్నానంటూ ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది తేజస్వి. కాగా జర్నలిజం చదివిన ఈ ముద్దుగుమ్మ నటనపట్ల ఆసక్తితో ఇండస్ట్రీలో అడుగుపెట్టింది.మహేశ్ బాబు నటించిన సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో ఈ భామకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఆర్జీవీ తెరకెక్కించిన ఐస్ క్రీమ్ సినిమాలో సోలో హీరోయిన్ గా నటించింది. అయితే తన కెరీర్ లో ఎక్కువగా సెకెండ్ లీడ్ పాత్రలనే పోషించింది తేజస్వి. అందులోనూ చాలా వరకు బోల్డ్ పాత్రలే. అలాగనీ ఈ సొగసరి ఆదాయం తక్కువేమీ కాదు. ఇన్ స్టాగ్రామ్ లో ఒక పోస్ట్ పెడితే లక్షల రూపాయలు వచ్చేవని ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది తేజస్వి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతా తలకిందులైంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ కేవలం టాక్ షోలకే పరిమితమైంది.



## చిరంజీవితో అనిల్ రావిపూడి మాస్టర్ ప్లాన్!

సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి మెగాస్టార్ చిరంజీవితో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ మూవీ ఇంకా సెట్‌పైకి వెల్లలేదు కానీ.. అనిల్ మాత్రం అప్పుడే ప్రమోషన్స్ మొదలెట్టేశాడు. సంక్రాంతికి వస్తున్నాం ప్రమోషన్స్‌లోనే చిరు సినిమాను అధికారికంగా ప్రకటించాడు. ఈ కథ కూడా కామెడీ పంథాలోనే సాగుతుందని హింట్ ఇచ్చేశాడు. అనిల్ రావిపూడి బలమే కామెడీ.. ఇక చిరంజీవి కామెడి టైమింగ్ గురించి అందరికి తెలిసిందే. వీరిద్దరు కలిసి ఓ కామెడీ సినిమా చేస్తున్నారంటే..దానిపై కచ్చితంగా భారీ అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలకు తగ్గట్టే స్క్రిప్ట్ రెడీ చేస్తున్నాడట అనిల్. ఈ సినిమాలో చిరంజీవిని సరికొత్తగా చూపించబోతున్నారట. అలాగే కథలో కూడా కొత్తదనం ఉండేలా ప్లాన్ చేస్తున్నాడట. చిరు మూవీ అనగానే.. డూయెట్లు, లవ్‌ట్రాక్ మస్ట్. కానీ అనిల్ వాటి జోలికి వెళ్లడం లేదట. చిరంజీవిని కంప్లీట్ ఫ్యామిలీమెన్‌గా చూపించబోతున్నారట. చిరంజీవి వయసు తగ్గట్టుగానే పాత్రను రాసుకున్నారట. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇంద్ర తర్వాత చిరంజీవి రాయలసీమ నేపథ్యంలో సినిమా చేయలేదు. ఇంద్రలో కూడా సీమ యాసను పూర్తిగా వాడలేదు. కానీ ఈచిత్రంలో చిరంజీవి పూర్తిగా రాయలసీమ యాసలోనే మాట్లాడతారట. డైలాగుల విషయంలోనూ అనిల్ జాగ్రత్త పడుతున్నారట. ఇక ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రలకు భూమిక, మృణాల్ ఠాకుర్‌లను ఎంపిక చేసినట్లు టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com